మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 3-4-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 || సంచిక: 274 Issue: 274

03 ఏప్రిల్ 2026 - శుక్రవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు చైత్ర మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:12 సూర్యాస్తమయం - సా. 6:26 తిథి పాడ్యమి ఉ. 8:43 వరకు తరువాత విదియ సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం చిత్తా రా. 7:22 వరకు తరువాత స్వాతి యోగం వృఘతా మ. 2:06 వరకు కరణం కౌలవ ఉ. 8:43 వరకు తైతుల రా. 9:25 వరకు వర్జ్యం రా. 1:30 నుండి తె. 3:15 వరకు దుర్ముహూర్తం ఉ. 8:39 నుండి ఉ. 9:28 వరకు మ. 12:43 నుండి మ. 1:32 వరకు రాహుకాలం ఉ. 10:47 నుండి మ. 12:19 వరకు యమగండం మ. 3:22 నుండి సా. 4:54 వరకు గుళికాకాలం ఉ. 7:44 నుండి ఉ. 9:16 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:36 నుండి తె. 5:24 వరకు అమృత ఘడియలు మ. 12:31 నుండి మ. 2:14 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:55 నుండి మ. 12:44 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
Circulated to Telangana



## జోక్యం చేసుకోం

**గ్రూప్ - 1 అభ్యర్థులకు సుప్రీంలో చుక్కెదురు**

**నియమాకాలు పూర్తయినందున ఏం చేయలేం**

**ప్రక్రియను రద్దు చేయలేమని వెల్లడి.. పిటిషన్ కొట్టివేత**

తెలంగాణలో తీవ్ర ఉత్కంఠ రేపుతున్న గ్రూప్-1 నియామకాల వ్యవహారంలో అత్యున్నత న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. 2024 నోటిఫికేషన్ ద్వారా జరిగిన ఈ నియామక ప్రక్రియపై జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఈవార్తలు): తెలంగాణ హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ.. గ్రూప్-1 అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వం లోని ధర్మాసనం మంగళవారం డిస్మిస్ చేసింది. వివరాల్లోకెళితే.. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో 563 గ్రూప్-1 పోస్టుల భర్తీ కోసం ఎంపిక ప్రక్రియ జరిగిన విషయం తెలిసిందే. అయితే ఈ నియామక ప్రక్రియలో, ముఖ్యంగా మూల్యాంకనంలో భారీ ఎత్తున అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ పలువురు అభ్యర్థులు కోర్టును తరువాయి 2 వ పేజీలో...



## మూసీ.. ముందుకే!

**ప్రాజెక్టుకు తొలగిన అడ్డంకి.. ఎన్జీటీలో సర్కార్‌కు భారీ ఊరట**

తెలంగాణ ప్రభుత్వానికి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)లో బిగ్ రిలీఫ్ వచ్చింది. మూసీ నది పునరుజ్జీవం, సుందరీకరణ ప్రాజెక్టును సవాల్ చేస్తూ.. బీఆర్ఎస్ నేత పటోళ్ల కార్తిక్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ఎన్జీటీ.. రేవంత్ సర్కార్‌కు ఊరటను ఇచ్చింది.



## బొందలగడ్డపై.. బతుకులు


కన్నతల్లి కన్నీళ్లు తుడవాలని..
కట్టుకున్నదాని కష్టాలు తీర్చాలని..
రెక్కాడకపోతే డొక్కాడదని..
రెక్కలు కట్టుకుని ఎడారి దేశానికి వెళ్లి..
నడినెత్తిపై భానుడు సెగలు కక్కుతున్నా..
ఒళ్లనే యంత్రంగా, రక్తాన్ని చెమటగా మార్చి..
కలల సౌధం కోసం కష్టపడుతున్నారు..
కానీ, ఆ కల కల్లగా మారి కాటికి పోతున్నరు..
ఒకరా.. ఇద్దరా.. రోజుకు ఇరవై మంది..
పెట్టెల్లో బందీలై మాతృభూమికి చేరుతున్నరు..

### విదేశాల్లో భారతీయ కార్మికుల దుర్భర స్థితి


**రోజుకు 20 మంది మృతి.. గల్ఫ్‌లోనే అధికం**

**గత ఐదేళ్లలో 37,740 మంది మరణం**

**పార్లమెంట్ సాక్షిగా వెల్లడించిన కేంద్రం**



న్యూఢిల్లీ: కన్నవాళ్లను, కట్టుకున్నవాళ్లను వదిలి పొట్టకూటి కోసం పరాయి దేశం పోతే పానాలే పోతున్నాయి. ఒకరిద్దరు కాదు.. సగటున రోజుకు 20 మంది విదేశీ గడ్డపై తుది శ్వాస విడుస్తున్నారు. అలా గత ఐదేళ్లలో ఏకంగా 37,740 మంది భారతీయ కార్మికులు కన్నోళ్లను చివరి చూపు చూడకుంటానే పరాయి లోకాలకు వెళ్లిపోతున్నారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన చేదు నిజమిది. అందులోనూ అత్యధిక మరణాలు గల్ఫ్ దేశాల్లోనే నమోదైనట్లు తెలిపింది. అయితే, వారి మరణాలకు గల కారణాలను మాత్రం ప్రభుత్వం వెల్లడించలేదు. ప్రభుత్వం తెలిపిన గణాంకాల ప్రకారం.. 2021లో అత్యధికంగా 8,234 మంది కార్మికులు మరణించారు. 2022లో ఆసంఖ్య 6,614కు తరువాయి 2 వ పేజీలో...



## పక్కలోకి.. పరాయిమొగుడు!

**వివాహేతర డేటింగ్ యాప్‌లో 40 మంది ఇండియన్స్**

**రెండేళ్లలో 148 శాతం పెరిగిన మహిళల భాగస్వామ్యం**

**బెంగళూరు ఫస్ట్ ప్లేస్.. హైదరాబాద్ సెకండ్ ప్లేస్**

మారుతున్న జీవనశైలి, టెక్నాలజీ వల్ల జీవిత భాగస్వామికి తెలియకుండా సీక్రెట్ డేటింగ్ కోసం వెతుకుతున్న భారతీయుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. దీనికి వివాహేతర డేటింగ్ యాప్ గ్లీడెన్ సాక్ష్యంగా నిలుస్తోంది. ఈ యాప్‌లో ఏకంగా 40 లక్షలకు పైగా భారతీయులు ఉన్నారని తాజా సర్వేలో తేలింది.

న్యూఢిల్లీ: 'గ్లీడెన్' డేటింగ్ యాప్ నిర్వహించిన తాజా సర్వేలో అనేక ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ సర్వే ప్రకారం.. ఈ యాప్‌లో 65 శాతం పురుషులు ఉంటే, 35 శాతం మంది మహిళలు ఉన్నారు. ఆశ్చర్యకరంగా గత రెండేళ్లలో మహిళల భాగస్వామ్యం 148 శాతం పెరిగిందని సర్వే స్పష్టం చేసింది. రహస్యంగా డేటింగ్ తరువాయి 2 వ పేజీలో...




## ఎయిర్‌టెల్.. నం.2

**ప్రపంచవ్యాప్తంగా 65 కోట్ల సబ్‌స్క్రైబర్లు**

**రెండో అతిపెద్ద టెలికం సంస్థగా రికార్డు**

**ఫస్ట్ ప్లేస్‌లో చైనా మొబైల్ టెలికం కంపెనీ**

**ఆ కంపెనీకి 100 కోట్లకుపైగా సబ్‌స్క్రైబర్లు**

### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,897 |
| వెండి (గ్రాము): | రూ.255 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,750 |

## తల్లిదండ్రుల బాధ్యత కూతుళ్లదీ!

**ఆస్తులతో పాటు సంరక్షణ కూడా తీసుకోవాలి., వృద్ధ తల్లిదండ్రుల విషయంలో హైకోర్టు కీలక వ్యాఖ్యలు**



తల్లిదండ్రుల ఆస్తిలో సమాన హక్కులు కోరుకుంటున్న కుమార్తెలు.. వృద్ధాప్యంలో వారిని సంరక్షించే బాధ్యతను కూడా సమానంగా తీసుకోవాలని తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆస్తి హక్కులతో పాటు బాధ్యతలను కూడా విస్మరించకూడదని స్పష్టం చేసింది. సూర్యాపేట జిల్లాకు చెందిన 66 ఏళ్ల వృద్ధురాలు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ బి. విజయ్‌సేన్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం.. నేటి సమాజంలో వృద్ధ తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న దీన స్థితిపై ఆవేదన వ్యక్తం చేసింది.

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఈవార్తలు): కేసు వివరాల్లోకి వెళితే.. సూర్యాపేట జిల్లాకు చెందిన సదరు పిటిషనర్ తన కుమారుడు తనను పట్టించుకోవడం లేదని తన ఆస్తిని తిరిగి ఇచ్చేలా అధికారులు ఇచ్చిన ఆదేశాలను లెక్క చేయటం లేదని కోర్టును ఆశ్రయించింది. 'తల్లిదండ్రుల సంరక్షణ వయోవృద్ధుల సంక్షేమ చట్టం' కింద ఇంటి పత్రాలను, భూమిని తిరిగి ఇవ్వాలని 2025 డిసెంబర్‌లో పిటిషనర్ కుమారుకి అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. ఆ ఉత్తర్వులను కుమారుడు బేఖాతరు చేయటమే కాకుండా.. తనను మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నాడని తరువాయి 2 వ పేజీలో...



## ఘనంగా అంజన్న విజయోత్సవం

**కాషాయమయమైన కొండగట్టు**

మల్యాల, ఏప్రిల్ 2 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొండగట్టు కాషాయమయంగా మారింది. గురువారం అంజన్న విజయోత్సవం (చిన్న జయంతి) సందర్భంగా భక్తులు, దీక్షా స్వాములు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తెలంగాణ నుంచే కాకుండా ఏపీ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర -2 వ పేజీలో...

### విశ్వవాణి



దక్షిణ ఫ్రాన్స్‌లో వందల సంఖ్యలో డైనోసార్ల గుడ్లు శిలాజాలుగా బయటపడ్డాయి. 7.2 కోట్ల సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ అవి చెక్కుచెదర కుండా ఉన్నాయి.

## కాళేశ్వరం.. కేసీఆర్ ఏటీఎం

**పార్లమెంట్‌లో కిషన్ రెడ్డి వ్యాఖ్యలు**

రాజ్యసభలో అమరావతి బిల్లుపై చర్చ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందన్నారు. కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్ట్ పిల్లర్లు కుంగాయన్నారు. కాళేశ్వరం వల్ల ఉగయోగం లేదని నివేదికలు చెప్పాయని తెలిపారు.



న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: కాళేశ్వరం ప్రజల డబ్బుతో కట్టారా? లేక కేసీఆర్ సొంత డబ్బుతో కట్టారా అంటూ ప్రశ్నించారు. రూ.లక్ష కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి నిధులు తీసుకొని కాళేశ్వరం నిర్మించారని కేంద్ర మంత్రి తెలిపారు. భద్రాచలంలో ఉన్న గ్రామాలు ఏపీ పునర్విభజన చట్టంలో చేర్చారని... అప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. ఎన్నికల ముందు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై విచారణ జరిపి కేసీఆర్‌ను జైలుకు పంపిస్తామని కాంగ్రెస్ చెప్పిందని.. మాజీ సీఎంపై ఎందుకు విచారణ జరపలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిలదీశారు.

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ ద్రోహి

### మాజీమంత్రి హరీశ్ రావు ధ్వజం



కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం రాజ్యసభలో ఆయన పచ్చి అబద్ధాలతో, చరిత్ర వక్రీకరణలతో తన లోపలి వికృతత్వాన్ని బయటపెట్టుకున్నారని విమర్శించారు. సభలో పలికింది కిషన్ రెడ్డే కానీ పలికించింది రేవంత్ రెడ్డి అని ఆరోపించారు.

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఈవార్తలు): ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయకుండా వెన్నుచూపి పారిపోయిన వ్యక్తి కిషన్ రెడ్డి అని ఆరోపించారు. నేడు పార్లమెంట్ సాక్షిగా మరోసారి ద్రోహానికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఏడు తరువాయి 2 వ పేజీలో...



## అమెరికాకు భంగపాటు తప్పదు

**ట్రంప్‌కు ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్**

టెహ్రాన్: అమెరికా, ఇరాన్ యుద్ధం ఇప్పట్లో ముగిసే సూచనలు కనిపించడం లేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రసంగం అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతోంది. బుధవారం -2 వ పేజీలో...

# రాశి ఫలాలు



3.4.2026

మేషం: సంతానం కొన్ని విషయాలలో మీ మాటతో విభేదిస్తారు. దూర ప్రయాణాలలో వాహన ఇబ్బందులు ఉంటాయి. చేపట్టిన పనులలో అవరోధాలు ఉన్నపటికీ నిదానంగా పూర్తిచేస్తారు. వృత్తి వ్యాపారాలు ఆశించిన రీతిలో రాణించవు. ఉద్యోగమున అదనపు బాధ్యతలు వలన తగిన విశ్రాంతి ఉండదు. దీర్ఘకాలిక ఋణ ఒత్తిడి పెరుగుతుంది.

వృషభం: కుటుంబ సభ్యుల ప్రవర్తన వలన మానసికంగా చికాకులు పెరుగుతాయి. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు వాయిదా వేస్తారు. ముఖ్యమైన వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు పనిచేయవు. ఆర్థిక వ్యవహారాలు కొంత మందగిస్తాయి. నిరుద్యోగుల కష్టం ఫలించదు. వ్యాపార ఉద్యోగాలలో నిలకడ లోపిస్తుంది.

మిధునం: నూతన పరిచయాల వలన ఆర్థిక లాభాలు కలుగుతాయి. ఇతరులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఆర్థిక ఇబ్బందుల నుంచి కొంతవరకు బయటపడతారు. పాత ఋణాలు తీరి ఊరట పొందుతారు. కుటుంబ సభ్యులు నుండి వ్యతిరేకత పెరుగుతుంది వృత్తి ఉద్యోగమున సానుకూల ఫలితాలుంటాయి.

కర్కాటకం: దూర ప్రాంతాల నుంచి అరుదైన సమాచారం అందుతుంది. ఆదాయం అంతగా ఉండదు. ఒక వ్యవహారంలో ఇంటా బయట సమస్యలు పెరుగుతాయి. చిన్ననాటి మిత్రులతో స్వల్ప మాటపట్టింపులుంటాయి. ఉద్యోగమున తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. సంతాన ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి.

సింహం: ఆకస్మిక ధన ప్రాప్తి కలుగుతుంది. కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయంలో శుభవార్తలు అందుతాయి. బంధు మిత్రులతో గృహమున సంతోషంగా గడుపుతారు. నూతన వ్యాపారమునకు సన్నిహితుల నుంచి పెట్టుబడులు లభిస్తాయి. దాయాదులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కారం దిశగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి.

కన్య: ధన వ్యవహారాలలో చిన్నపాటి ఇబ్బందులు ఉంటాయి. సంతాన ఉద్యోగ ప్రయత్నాలు కొంత నిరాశ కలిగిస్తాయి. చుట్టుపక్కలవారితో ఊహించని విభేదాలు కలుగుతాయి. భాగస్వామ్య వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోకపోవడం మంచిది.

తుల: కీలక వ్యవహారాలలో కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. అవసరాలకు సన్నిహితుల నుండి ధన సహాయం లభిస్తుంది. నూతన వ్యాపారాల ప్రారంభానికి శ్రీకారం చుడతారు. దైవ సేవా కార్యక్రమాలపై ఆసక్తి పెరుగుతుంది. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

వృశ్చికం: చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు. స్థిరాస్తి వివాదాలలో సోదరులతో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. దూరపు బంధువుల నుంచి కీలక సమాచారం అందుతుంది. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగుపడుతుంది. కుటుంబ సభ్యులతో గృహమున సఖ్యతగా వ్యవహరిస్తారు. ఉద్యోగమున అధికారుల ఆదరణ పెరుగుతుంది.

ధనస్సు: వృత్తి ఉద్యోగాలలో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో విశేషంగా పాల్గొంటారు. దైవ అనుగ్రహంతో అనుకున్న పనులు పూర్తి చేస్తారు. వృత్తి వ్యాపారాలలో నూతన ఉత్సాహంతో లాభాలు అందుకుంటారు. ఆప్తుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ప్రయాణాలలో స్వల్ప ఇబ్బందులు కలుగుతాయి.

మకరం: ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు అవసరమౌతాయి. ఇంటా బయట కొన్ని పరిస్థితులు మరింత చికాకు కలిగిస్తాయి. కుటుంబ సభ్యులతో కారణం లేకుండా వివాదాలు కలుగుతాయి. ఉద్యోగస్తులు అధికారులతో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. ఆర్థిక ఇబ్బందులు వలన ఒత్తిడి అధికమౌతుంది. నూతన ఋణ యత్నాలు అంతగా కలిసిరావు.

కుంభం: ఉద్యోగమున అదనపు బాధ్యతల నుండి కొంత ఉపశమనం లభిస్తుంది. పాత ఋణాలు తీరుతాయి. ప్రయాణాలలో నూతన మిత్రులతో పరిచయాలు పెరుగుతాయి. ఆర్థికంగా అనుకూల వాతావరణం ఉంటుంది. గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాల్చుతాయి. వ్యాపారమున భాద్యతలు సమర్థవంతంగా నిర్వహించి లాభాలు పొందుతారు.

మీనం: ఇంటా బయట శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. నూతన వ్యాపారాలు విజయవంతంగా సాగుతాయి. సోదరుల సహాయ సహకారములతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. నిరుద్యోగులకు అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. ప్రయాణాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి.

# బొందలగడ్డపై..బతుకులు

మొదటి పేజీ తరువాయి

తగ్గింది. మళ్లీ 2023లో స్వల్పంగా పెరిగి మరణాలు 7,291కు చేరాయి. 2024లో 7,747 మంది, 2025లో ఆసంఖ్య 7,854గా ఉంది. ఈ మొత్తం మరణాల్లో 86 శాతం గల్ఫ్ దేశాల్లోనే నమోదైనట్లు ప్రభుత్వం తెలిపింది. ఐదేళ్లలో అత్యధికంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో 12,380 మంది, సౌదీ అరేబియాలో 11,757 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత కువైట్‌లో 3,890 మంది, ఒమన్ (2,821), మలేషియా (1,915), ఖతార్‌లో 1,760 మంది ప్రాణాలు కోల్పోయారు. అదే ఐదేళ్ల కాలంలో వేధింపులు, దోపిడీ, పని ప్రదేశాల్లో సమస్యలకు సంబంధించి భారత రాయబార కార్యాలయాలకు మొత్తం 80,985 ఫిర్యాదులు అందాయి. ఇందులో కూడా 16,965 ఫిర్యాదులతో యూఏఈ అగ్రస్థానంలో ఉంది. కువైట్ (15,234), ఒమన్ (13,295), సౌదీ అరేబియా (12,988) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మరోవైపు, 2018 నాటి పీటీఐ నివేదిక ప్రకారం.. 2012-18 మధ్య కాలంలో గల్ఫ్ దేశాల్లో ప్రతిరోజూ దాదాపు 10 మంది భారతీయ కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఆ ఆరేళ్ల కాలంలో బ్రహెయిన్, ఒమన్, ఖతార్, కువైట్, సౌదీ అరేబియా, యూఏఈ దేశాల్లో కనీసం 24,570 మంది భారతీయ కార్మికులు మరణించినట్లు కామన్వెల్త్ హ్యూమన్ రైట్స్ ఇనిషియేటివ్ నివేదిక పేర్కొంది. ఈ గణాంకాలతోపోలిస్తే.. తాజా ప్రభుత్వ



గణాంకాలు ఆందోళన కలిగించేలా ఉన్నాయి. బ్రహెయిన్ మినహా మిగిలిన గల్ఫ్ దేశాల్లో 2021 -25 మధ్య కాలంలో 32,608 మంది భారతీయ కార్మికులు మరణించారు. అంటే గత ఐదేళ్లలో కేవలం గల్ఫ్ ప్రాంతంలోనే సగటున ప్రతిరోజూ దాదాపు 18 మంది కార్మికులు మరణిస్తున్నారు.

**గత ఐదేళ్లలో విదేశాల్లో భారతీయుల మరణాలు:**

2021 - 8,234
2022 - 6,614
2023 - 7,291
2024 - 7,747
2025 - 7,854

**దేశాల వారీగా మరణాలు:**

యూఏఈ - 12,380
సౌదీ - 11,757
కువైట్ - 3,890
ఒమన్ - 2,821
మలేషియా - 1,915
ఖతర్ - 1,760
అమెరికా - 454
సింగపూర్ - 451
నైజీరియా - 210
యూకే - 188
(గల్ఫ్ దేశాల్లో మరణాలు - 86 శాతం)



# మూసీ.. ముందుకే!

## ప్రాజెక్టుకు తొలగిన అడ్డంకి
## ఎన్జీటీలో సర్కార్‌కు భారీ ఊరట

న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వానికి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)లో బిగ్ రిలీఫ్ వచ్చింది. మూసీ నది పునరుజ్జీవం, సుందరీకరణ ప్రాజెక్టును సవాల్ చేస్తూ.. బీఆర్ఎస్ నేత పటోళ్ల కార్తిక్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ఎన్జీటీ.. రేవంత్ రెడ్డి సర్కార్‌కు ఊరటను ఇచ్చింది. దీంతో మూసీ ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎదురైన న్యాయపరమైన అడ్డంకి తొలగినట్లయింది. మూసీ ప్రక్షాళన కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ ప్రాజెక్టు వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని.. అక్కడ నిబంధనలకు విరుద్ధంగా ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని కార్తిక్ రెడ్డి ఎన్జీటీలో పిటిషన్ దాఖలు చేశారు. గాంధీ సరోవర్ ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు ఉల్లంఘించారని పిటిషనర్ పటోళ్ల కార్తిక్ రెడ్డి పేర్కొన్నారు. అయితే రాజకీయ దురుద్దేశంతోనే పిటిషనర్ పిటిషన్ వేశారని రాష్ట్ర ప్రభుత్వం వాదనలు వినిపించింది. దీనిపై ఇరు పక్షాల వాదనలు విన్న ఎన్‌జీటీ విచారణ జరిపి.. పిటిషనర్ దాఖలు చేసిన పిటిషన్‌లో సరైన ఆధారాలు లేవని పేర్కొంటూ.. కేసును డిస్మిస్ చేసింది. పిటిషనర్ చేస్తున్న వాదనలకు సంబంధించి ఎలాంటి టెక్నికల్, శాస్త్రీయ ఆధారాలను సమర్పించలేదని ఎన్జీటీ తెలిపింది. కేవలం పిటిషనర్ పేర్కొంటున్న అనుమానాలతో మూసీ ప్రాజెక్టును అడ్డుకోలేమని తేల్చి చెప్పింది. అదే సమయంలో ఈ ప్రాజెక్టుకు సంబంధించి.. పర్యావరణ ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఆరోపించిన పిటిషనర్.. వాటిని నిరూపించడంలో మాత్రం విఫలమయ్యారని ఎన్జీటీ అభిప్రాయం వ్యక్తం చేస్తూ.. పిటిషన్‌ను కొట్టివేసింది.

# కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ ద్రోహి

మొదటి పేజీ తరువాయి

మండలాలను ఏపీకి అప్పగించాలనేది విభజన చట్టంలో ఉందని కిషన్ రెడ్డి పేర్కొనడం చారిత్రక అవాస్తవమే కాదు, తెలంగాణకు చేస్తున్న తీరని ద్రోహం కూడా అన్నారు. విభజన చట్టానికి సవరణ తెచ్చి ఆర్డినెన్స్ ద్వారా ఏడు మండలాలను ఏపీకి కట్టబెట్టింది ముమ్మాటికి బిజెపి ప్రభుత్వమే అన్నారు. ఈ పాపంలో కిషన్ రెడ్డి పాత్ర కూడా ఉందని అన్నారు. ఉద్యమం సమయంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చి, మీరు చేసిన ద్రోహాన్ని ఎండగట్టిన విషయాన్ని మరిచిపోయారా అని కిషన్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. కిషన్ రెడ్డి పార్లమెంట్ సాక్షిగా చరిత్ర వక్రీకరణకు పాల్పడి ఈరోజు తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానించారని ధ్వజమెత్తారు. ఇది వారి కుట్రకు నిదర్శనమని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్నే ఈరోజు కిషన్ రెడ్డి పార్లమెంట్‌లో చేయడం కాంగ్రెస్, బీజేపీ చీకటి పొత్తుకు సాక్ష్యమని ఆరోపించారు. ప్రపంచంలోనే అతి పెద్ద బహుళ దశల ఎత్తిపోతల ప్రాజెక్టుగా కాళేశ్వరం నిర్మించడం అబద్ధమా? అని నిలదీశారు. 148 మీటర్ల దిగువ ప్రాంతం నుంచి 618 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోయడం అబద్ధమా? ఈరోజు, ఈ నిమిషానికి మండుటెండల్లో సైతం కాళేశ్వరం ప్రాజెక్ట్ కాల్వల ద్వారా జలాలు రైతుల పొలాలకు చేరుతుండటం అబద్ధమా? ఏది అబద్ధమో కిషన్ రెడ్డి చెప్పాలని ప్రశ్నించారు. పంట పొలాల్లో పారుతున్న కాళేశ్వరం జలాలను చూపించేందుకు నేను సిద్ధం వచ్చేందుకు మీకు దమ్ముందా? అని సవాల్ చేశారు. మీరు క్యాబినెట్ మంత్రిగా ఉండి, ఏ ప్రభుత్వం అయినా ప్రజా ధనంతోనే నిర్మాణాలు చేస్తుందన్న ఇంగితం మరిచి కేసీఆర్ జేబులోంచి డబ్బు ఖర్చు పెట్టారా? అని అడగడం మీ అవివేకానికి, అతి తెలివికి నిదర్శనమని దుయ్యబట్టారు. మీ బీజేపీ ప్రభుత్వం నిర్మిస్తున్న జాతీయ రహదార్లు, ప్రాజెక్టులకు మీ సొంత పైసలు ఖర్చు పెడుతున్నారా? అని ప్రశ్నించారు. ఆ పైసలు దుబాయ్‌లో ముద్రిస్తున్నారా? లేక మీ జేబుల్లో నుండి ఖర్చు చేస్తున్నారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం వల్ల ఉపయోగంలేదని కిషన్ రెడ్డి గొంతు చించుకున్నారని ఆరోపించారు. కానీ గతంలో బీజేపీ ప్రభుత్వ పెద్దలు నితిన్ గడ్కరీ నుంచి సీడబ్ల్యూసీ చైర్మన్ మసూద్ వరకు కాళేశ్వరంపై కురిపించిన ప్రశంసలు అబద్ధమా లేక అవివేకమా అని ప్రశ్నించారు. నిన్నగాక మొన్న పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా' రిపోర్ట్ ప్రకారం, "2014లో తెలంగాణలో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం ఉంది. 2023 నాటికి ఏకంగా 2.2 కోట్ల ఎకరాలకు పెరిగింది. దీనికి ప్రధాన కారణం కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ పథకాలే" అని కుండబద్దలు కొట్టిందని అన్నారు. ఇది కిషన్ రెడ్డి కళ్లకు కనబడటం లేదా అని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి చెప్పింది మాత్రమే ఆయన చెవుల్లోకి వెళుతున్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. పూటకో తీరు మాట్లాడటం రాజనీతి కాదని హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని, తెలంగాణకు నిధులు కేటాయించాలని మా ఎంపీ సురేశ్ రెడ్డి ఎంతో హుందాగా బాధ్యతగా మాట్లాడితే, మీరు దాన్ని సమర్థించకపోగా బాధ్యత మరిచి వ్యర్థ రాజకీయ ప్రేలాపనలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు సభలో పలికింది కిషన్ రెడ్డే కానీ పలికించింది మాత్రం రేవంత్ రెడ్డేనని వ్యాఖ్యానించారు. 8 మంది బీజేపీ ఎంపీలు, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉండి తెలంగాణ వాదాన్ని వినిపించకపోవడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు.

# తల్లిదండ్రుల బాధ్యత కూతుళ్లదీ!

మొదటి పేజీ తరువాయి

ఆమె వాపోయింది. ప్రస్తుతం తాను కుమార్తె వద్ద ఉంటున్నానని పిటిషన్‌లో పేర్కొంది. ఈ విచారణ సందర్భంగా జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి సమాజంలోని పోకడలను ఎత్తిచూపారు. ప్రస్తుతం కోర్టుల్లో వృద్ధ తల్లిదండ్రులు తమ కుమారులు, కోడళ్లను ఆస్తుల నుంచి గెంటివేయాలని కోరుతూ దాఖలు చేసే పిటిషన్లు వెల్లువలా వస్తున్నాయని చెప్పారు. ప్రతిరోజూ కనీసం రెండు వరకు ఇలాంటి పిటిషన్లు విచారణకు వస్తున్నాయన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే రాజీ మార్గాలు వెతకాలన్నారు. ఆస్తి నుంచి వెలివేయడం అనేది చివరి ప్రయత్నంగా ఉండాలని.. కానీ బాధితులు మొదటి దశలోనే ఆ విజ్ఞప్తి చేస్తున్నారని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ముఖ్యంగా కుమార్తెల బాధ్యత గురించి ప్రస్తావిస్తూ.. కేవలం కుమారులు లేని వారే కాదు, కుమార్తెలు ఉన్నవారు కూడా వృద్ధాప్యంలో ఇబ్బందులు పడుతున్నారని కోర్టు అభిప్రాయపడింది. చాలా సందర్భాల్లో కుమార్తెలు తల్లిదండ్రుల ఆస్తిపై హక్కులు కోరుకుంటున్నారు కానీ, వారిని సంరక్షించే విషయంలో వెనకాడుతున్నారన్నారు. కేవలం కుమార్తెలు మాత్రమే ఉన్న తల్లిదండ్రుల పరిస్థితి ఏమిటని కోర్టు ప్రశ్నించింది. కుమార్తెలు కచ్చితంగా బాధ్యత వహించాలని స్పష్టం చేశింది. ఆస్తిలో వాటా అడిగే ప్రతి కుమార్తె, తల్లిదండ్రుల బాగోగులు చూసుకోవాల్సిన నైతిక, చట్టపరమైన బాధ్యతను కలిగి ఉంటుందని గుర్తు చేశారు. విచారణ సందర్భంగా కోదాడ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ గతంలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో పోలీసు, పరిపాలనా యంత్రాంగం విఫలమైందని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. అధికారులు పట్టించుకోకపోవటం పిటిషనర్ హక్కులను ఉల్లంఘించడమేనని న్యాయమూర్తి కోర్టుకు విన్నవించింది. దీనిపై స్పందించిన న్యాయమూర్తి.. పిటిషనర్ ఆరోపణలపై వివరణ ఇవ్వాలని సూర్యాపేట జిల్లా అధికారులను ఆదేశిస్తూ.. తదుపరి విచారణను ఏప్రిల్ 15వ తేదీకి వాయిదా వేశారు.

## ..పరాయిమొగుడు!

మొదటి పేజీ తరువాయి

చేసే వారు అత్యధికంగా బెంగళూరులో ఉన్నారని సర్వే పేర్కొంది. మొత్తం యూజర్లలో 18 శాతం మంది ఇక్కడి నుంచే ఉన్నారు. దీని తర్వాత మన హైదరాబాద్ 17 శాతంతో రెండో స్థానంలో ఉండటం గమనార్హం. ఢిల్లీ(11 శాతం), ముంబై(9 శాతం), పూణె(7 శాతం)తో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఆశ్చర్యకరంగా ఈ ధోరణి ప్రధాన నగరాలకే కాకుండా టైర్2 నగరాలైన లక్నో, పాట్నా, భువనేశ్వర్, సూరత్, చండీగఢ్ లాంటి నగరాల్లోనూ వేగంగా పెరుగుతోందని నివేదిక పేర్కొంది. గత రెండేళ్లలో గ్లీడెన్ యాప్‌లో మహిళల సంఖ్య ఏకంగా 148 శాతం పెరిగిందని సర్వే తెలిపింది. మహిళలు తాము తీసుకునే నిర్ణయాల్లో ఎంత స్వేచ్ఛగా, ఆత్మవిశ్వాసంతో వ్యవహరిస్తున్నారనే దానికి ఈ వృద్ధి సూచిస్తోందని గ్లీడెన్ ఇండియా కంట్రీ మేనేజర్ సిబిల్ షిడెల్ చెప్పారు. యాప్‌లో యూజర్లు గడిపే సమయాన్ని కూడా గ్లీడెన్ వెల్లడించింది. యూజర్లు సగటున రోజుకు గంట లేదా గంటన్నర పాటు చాట్ చేస్తున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం సమయంలో 1 నుంచి 3 గంటల మధ్య, రాత్రి 10 నుంచి అర్ధరాత్రి వరకు యాప్ ట్రాఫి అధికంగా నమోదవుతోంది.

## అమెరికాకు భంగపాటు తప్పదు

మొదటి పేజీ తరువాయి

రాత్రి జాతిని ఉద్దేశించి ప్రసంగించిన ట్రంప్.. 'రాబోయే రెండు మూడు వారాల్లో ఇరాన్‌పై మరింత కఠినంగా దాడులు చేయబోతున్నాం. వారిని వారు ఉండాల్సిన శిలాయుగంలోకి నెట్టేస్తాం. మా సైనిక లక్ష్యాలు దాదాపు నెరవేరాయి' అని ఆయన ప్రకటించారు. ఇరాన్ తన షరతులకు అంగీకరించకపోతే ఇంధన, చమురు మౌలిక సదుపాయాలపై దాడులు తప్పవని పరోక్షంగా హెచ్చరించారు. తన యుద్ధానికి మద్దతు ఇవ్వని నాటో మిత్రదేశాలపై కూడా ట్రంప్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ సైన్యం తీవ్ర స్థాయిలో మండిపడింది. 'అమెరికాకు శాశ్వత అవమానం, లొంగుబాటు ఎదురయ్యే వరకు ఈ యుద్ధం కొనసాగుతుంది' అని హెచ్చరించింది. ఇరాన్ వ్యూహాత్మక సామర్థ్యాల గురించి అమెరికాకు ఏమాత్రం అవగాహన లేదని ఖతమ్ అల్-అన్బియా సెంట్రల్ హెడ్‌క్వార్టర్స్ ప్రతినిధి ఇబ్రహీం జొల్ఫాఘరి స్పష్టం చేశారు. యుద్ధం, చర్చలు, కాల్పుల విరమణ అనే విషవలయాన్ని తాము ఇక ఎంతమాత్రం సహించబోమని ఇరాన్ విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

## ఘనంగా అంజన్న విజయోత్సవం

మొదటి పేజీ తరువాయి

నుంచి భక్తులు కొండగట్టుకు చేరుకున్నారు. ఇరుముడితో కొండకు చేరుకున్న మాలధారులు ముందుగా కోనేరులో స్నానం చేసిన అనంతరం స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో గుట్టపైన, కింద, జాతీయ రహదారి వెంట ఎక్కడ చూసినా కాషాయ వర్ణంతో ధగధగలాడింది. అంజన్న సన్నిధి జైశ్రీరాం.. జై హనుమాన్ నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగిపోయింది. అటు.. భక్తుల రద్దీ కారణంగా వై జంక్షన్ నుంచి వాహనాల రద్దీ ఏర్పడింది. ట్రాఫిక్ జామ్ తలెత్తకుండా వై జంక్షన్ నుంచి జేఎన్టీయూ వరకు పది పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. గురువారం దాదాపు లక్ష మంది వరకు భక్తులు స్వామి సన్నిధికి వచ్చినట్లు సమాచారం. గుట్టపై ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో తాగునీటి సౌకర్యం కోసం 20 చలివేంద్రాలను ఏర్పాటు చేశారు.

## జోక్యం చేసుకోం

మొదటి పేజీ తరువాయి

ఆశ్రయించారు. నోటిఫికేషన్‌ను రద్దు చేసి, మరోసారి పకడ్బందీగా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. దీనిపై ముందుగా విచారణ చేపట్టిన తెలంగాణ హైకోర్టు సింగిల్ బెంచ్.. గ్రూప్-1 పరీక్షల్లో ఎలాంటి అక్రమాలు జరిగినట్లు తమకు ఆధారాలు కనిపించలేదని స్పష్టం చేసింది. నియామక ప్రక్రియను యథాతథంగా కొనసాగించుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వానికి, టీఎస్‌పీఎస్సీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పుపై అసంతృప్తి వ్యక్తం చేసిన అభ్యర్థులు సుప్రీంకోర్టు మెట్లు ఎక్కారు. సింగిల్ బెంచ్ తమ వాదనలను కనీసం పరిగణనలోకి తీసుకోకుండానే తీర్పు ఇచ్చిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. అభ్యర్థుల తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. 'మూల్యాంకనంలో స్పష్టంగా అక్రమాలు జరిగాయని చెప్పినా పట్టించుకోలేదు. కాబట్టి వెంటనే ఈ పరీక్షను రద్దు చేసి, పారదర్శకంగా మళ్లీ నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలి' అని కోరారు. టీఎస్‌పీఎస్సీ తరపున సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించారు. 'గ్రూప్-1 నియామక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా మూడు దశల్లో జరిగింది.




## ఫ్లాష్.. ఫ్లాష్: 'బైకర్' రివ్యూ

తెలుగులో స్పోర్ట్స్ డ్రామాలు కొత్త కాదు.. కానీ మోటోక్రాస్ మీద మాత్రం కొత్తే. ఆ పాయింట్ పట్టుకున్నపుడే శర్వానంద్ సగం సక్సెస్ అయ్యాడు. బైకర్ కచ్చితంగా రెగ్యులర్ కమర్షియల్ సినిమా కాదు. ఇది ఓ కొత్త ఎక్స్పీరియన్స్ అయితే తప్పకుండా ఇస్తుంది. ఫస్ట్ హాఫ్ అంతా స్టోరీ బాగా సెటప్ చేసుకున్నాడు దర్శకుడు అభిలాష్ రెడ్డి. కాస్త స్లో నేరేషన్ ఉంది.. కానీ డిటైలింగ్ కోసం టైమ్ తీసుకున్నాడు. ఇంటర్వెల్ పర్ఫెక్ట్ గా బ్లెండ్ చేశాడు దర్శకుడు. కీలకమైన సెకండ్ హాఫ్ అంతా ఎమోషనల్ రోలర్ కోస్టర్ లా సాగింది. చిన్న కథ.. కానీ మోటోక్రాస్ బ్యాక్ డ్రాప్ అనేసరికి ఆసక్తి రేపుతుంది. ముఖ్యంగా రేసింగ్ సీన్స్, అవి చేస్తున్నపుడు వచ్చే సౌండ్ డిజైనింగ్ బాగున్నాయి. హీరో హీరోయిన్ ట్రాక్ కాస్త జెర్సీ సినిమాను గుర్తు చేసింది. క్లైమాక్స్ ఎమోషన్స్ బాగున్నాయి. శర్వానంద్ ఈ క్యారెక్టర్ కోసం ప్రాణం పెట్టేసాడు. రాజశేఖర్ పాత్ర మేజర్ హైలైట్. ఆయన సినిమాకు ప్రాణం. ఇది కచ్చితంగా ఆయనకు సెకండ్ ఇన్నింగ్స్. మ్యూజిక్ కూడా మేజర్ ప్లస్. డైరెక్టర్ అభిలాష్ రెడ్డి కొత్తగా ట్రై చేశాడు.

**ఓవరాల్ గా బైకర్.. రేసింగ్ సినిమాలు ఇష్టపడేవాళ్లకు నచ్చుతుంది.. అలాగే ఎమోషన్స్ కూడా..!**

సమీక్షకుడు: ప్రవీణ్ కుమార్, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్టు

# దోమల తెర ధరించి ప్రెస్‌మీట్

**ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వినూత్న నిరసన**

**హైదరాబాద్‌లో దోమల బెడదపై ఆగ్రహం**



హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఈవార్తలు): హైదరాబాద్ లో జనాన్ని పట్టిపీడిస్తున్న ప్రధాన సమస్యల్లో దోమల బెడద ఒకటని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇళ్ళు, రోడ్లు, గ్రౌండ్లు అనే తేడా లేకుండా ఎక్కడ చూసినా దోమలు విపరీతంగా ఉంటున్నాయి. హైదరాబాద్ లో దోమల బెడదపై సోషల్ మీడియాలో కూడా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి దోమల బెడదపై వినూత్న రీతిలో నిరసన తెలిపారు. గురువారం ( ఏప్రిల్ 2 ) అసెంబ్లీ మీడియా హాల్ లో దోమతెరతో కుట్టిన డ్రెస్ తో ప్రెస్ మీట్ కి హాజరయ్యారు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైదరాబాద్ లో నోరు తెరిస్తే నోట్లోకి దోమలు పోతున్నాయని అన్నారు సుధీర్ రెడ్డి. దోమలతో హైదరాబాద్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని... తమ హయంలో నాలుగు , ఐదు సార్లు దోమల బెడద లేకుండా చర్యలు తీసుకునే వాళ్ళమని..దోమలు పై ఈ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. దోమల ద్వారా డెంగ్యూ, మలేరియాతో పేద ప్రజలు ఆసుపత్రి పాలవుతున్నారని.. దోమలు అరికట్టలేని ప్రభుత్వం అవసరమా అని ప్రజలు భావిస్తున్నారని అన్నారు సుధీర్ రెడ్డి. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నపుడు మాత్రమే కొన్ని నిబంధనలు ఉంటాయని..దోమల బెడద పై అసెంబ్లీ మీడియా హాల్లో దోమ తెరతో మీడియా సమావేశం ఏర్పాటు చేసుకుంటే మార్షల్స్ అడ్డుకున్నారని అన్నారు. హైదరాబాద్ ను మూడు ముక్కలు చేసి మరిన్ని సమస్యలకు కారణం చేశారని అన్నారు. దోమల బెడదకు భయపడి ఎవరు హైదరాబాద్ రావడం లేదని..హైదరాబాద్ లో దోమల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. దోమల బెడదను అరికట్టకుంటే హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కు మరింత నష్టం జరిగే అవకాశం ఉందని అన్నారు సుధీర్ రెడ్డి. తన ప్రెస్ మీట్ ను అడ్డుకున్న మార్షల్స్ తీరును తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. ప్రతి డివిజన్ కు 10 ఫాగింగ్ మిషన్ లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు. రెండేళ్లలో కాంగ్రెస్ పార్టీ ఏం సాధించిందని సంబరాలు చేసుకుంటున్నారంటూ ప్రశ్నించారు. హైదరాబాద్ ప్రజలు దోమ తెర కుట్టించుకునే పరిస్థితి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమేనని..కరోనా వచ్చినప్పుడు మాస్క్ ఎలా పెట్టుకున్నామో , హైదరాబాద్ లో దోమల బెడద తట్టుకోలేక దోమ తెర కుట్టించుకునే పరిస్థితి వచ్చిందని అన్నారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

# కొత్తగా 2 లక్షల పెన్షన్లు

**రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం**



హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఈవార్తలు): తెలంగాణలో కొత్త పెన్షన్ల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న లక్షలాది మందికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. చేయూత పథకం కింద కొత్తగా మరో 2 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా 2026-27 వార్షిక బడ్జెట్‌లో రూ.233 కోట్లను కేటాయించడంతో, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు రంగం సిద్ధమైంది. అయితే, ఇప్పటికే పేరుకుపోయిన లక్షలాది దరఖాస్తుల నుంచి అర్హులను గుర్తించడం అధికారులకు పెను సవాల్‌గా మారనుంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేటగిరీలలో 42.23 లక్షల మంది నెలనెలా చేయూత పెన్షన్లు పొందుతున్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత కార్మికులు, హెచ్ఐవీ, బోదకాలు బాధితులకు నెలకు రూ.2,016 చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. దివ్యాంగులకు మాత్రం పెన్షన్‌ను రూ.4,016గా ఇస్తున్నారు. ఇప్పుడు ఈ జాబితాలోకి మరో 2 లక్షల మంది కొత్తగా చేరనున్నారు. గత మూడేళ్లుగా బోదకాలు, డయాలసిస్ బాధితులకు తప్ప కొత్తగా ఎలాంటి పెన్షన్లు మంజూరు కాకపోవడంతో అర్హులైన వారు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 లక్షలకు పైగా దరఖాస్తులు ప్రభుత్వానికి చేరి పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల బడ్జెట్‌లో కొత్త పెన్షన్ల ప్రకటన వెలువడిన తర్వాత, ఫిబ్రవరి 20 నుంచి ప్రజావాణి వంటి కార్యక్రమాల ద్వారా దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు, గురువారం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న గ్రామసభల్లో కూడా భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం ఆమోదించినవి 2 లక్షల పెన్షన్లు కాగా, ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్య 12 లక్షలు దాటింది. వీటిలో వృద్ధాప్య పింఛన్ కోసం 4 లక్షలు, వితంతు, ఒంటరి మహిళల కోటాలో 3.5 లక్షలు, గీత, చేనేత కార్మికుల విభాగంలో 3 లక్షలు, దివ్యాంగుల పింఛన్‌కు 72 వేల దరఖాస్తులు ఉన్నాయి. ఈ భారీ సంఖ్య నుంచి కేవలం 2 లక్షల మంది అత్యంత అర్హులను ఎంపిక చేసేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు త్వరలోనే పటిష్టమైన వడపోత కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడం ప్రభుత్వానికి కత్తిమీద సాములా మారింది.



## స్విమ్మింగ్ పూల్‌లో తల్లి, ఇద్దరు కూతుళ్ల అనుమానాస్పద మృతి

హనుమకొండ, ఏప్రిల్ 2 (ఈవార్తలు): ఓ తల్లి, ఆమె ఇద్దరు కుమార్తెలు స్విమ్మింగ్ పూల్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషాదకర ఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పున్నేలు గ్రామంలో నిన్న రాత్రి జరిగింది. పోలీసులు ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వివరాల్లోకి వెళితే.. పున్నేలు గ్రామానికి చెందిన అజారుద్దీన్, ఫర్హత్ (26) దంపతులు. వీరికి ఉమేరా (8), ఆయేషా (6) అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అజారుద్దీన్ స్థానికంగా ఓ స్విమ్మింగ్ పూల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నిన్న రాత్రి కుటుంబ సభ్యులంతా స్విమ్మింగ్ పూల్ వద్దకు వెళ్లారు. కాసేపటి తర్వాత ఫర్హత్, ఆమె ఇద్దరు కూతుళ్లు పూల్‌లో శవాలై తేలారు. సమాచారం అందుకున్న ఐనవోలు పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఫర్హత్ ఇటీవల మూడోసారి గర్భం దాల్చిందని, ఈ విషయంపై భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయని ఆమె తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తమ కూతురు, మనవరాళ్ల మృతిపై వారు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో మృతురాలి తండ్రి అలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## 76 మంది విద్యాశాఖ సిబ్బందికి నోటీసులు

గద్వాల కలెక్టర్ సంచలన నిర్ణయం

గద్వాల: జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. విద్యాశాఖలో ఒకేసారి 76 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఫేస్ రికగ్నైజ్ సిస్టం హాజరు విధానం సక్రమంగా నిర్వహించకపోవడంతో 76 మంది విద్యాశాఖ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. గురువారం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలలో అమలవుతున్న ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ హాజరు నమోదుపై సమగ్రంగా పరిశీలించగా పలుచోట్ల ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది ఎఫ్.ఆర్.ఎస్ యాప్‌లో హాజరు సక్రమంగా నమోదు చేయకపోవడాన్ని గమనించినట్లు వివరించారు. సంబంధిత సిబ్బంది తమ సంజాయిషీని మూడు రోజుల లోపు సమర్పించాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రభుత్వం నిర్దేశించిన విధి విధానాలను కచ్చితంగా పాటించడంతో పాటు, ప్రతి రోజూ ఎఫ్.ఆర్.ఎస్ ద్వారా హాజరును తప్పనిసరిగా సమయానికి నమోదు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# ఏఐ నష్టాలు.. మూడంచెల చట్టం!

**కల్వకుంట్ల కవిత కీలక సూచనలు**



హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఈవార్తలు): కృత్రిమ మేధ (ఏఐ-ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కారణంగా చాలామంది ఉద్యోగాలు పోతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక సూచన చేశారు. ఏఐ వల్ల జరుగుతున్న ఉద్యోగ నష్టాన్ని అధిగమించడానికి మూడంచెల ఒక ప్రత్యేక చట్టం అత్యవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ఒకటి జాతీయ, రాష్ట్రస్థాయి పర్యవేక్షణ యంత్రాంగం, రెండోది సామాజిక రక్షణ, పరిశ్రమ భాగస్వామ్యం మరియు నైపుణ్యాభివద్ధి పెంచడం ద్వారా ఏఐ ఆధారిత ఉద్యోగ నష్టాన్ని అధిగమించే ప్రయత్నం చేయాలని సూచించారు. ఈ సూచనలతో కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్, తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు కార్యాలయానికి ట్యాగ్ చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణలో చేనేతకారుల జీవితాలను అంధకారంలోకి నెట్టేసే కుట్రలు చేస్తోందని కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉన్న విద్యాశాఖ ఆధ్వర్యంలోని యూనిఫామ్‌ల ఆర్డర్‌ను ఏకపక్షంగా రద్దు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆర్డర్లపై ఎంతోమంది చేనేత కార్మికులు ఆధారపడ్డారని, ఈ ప్రభుత్వం వారి పొట్ట కొట్టిందని విమర్శించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఇచ్చే రూ.105 కోట్ల విలువైన యూనిఫామ్‌ల ఆర్డర్ ద్వారా వేలాది మంది చేనేత కార్మికులకు ఉపాధి లభిస్తుంటుందని తెలిపారు. కానీ ఈసారి ఆర్డర్ రద్దు చేయడం దారుణమని అన్నారు. సంక్షేమ శాఖలు, ఇతర డిపార్టుమెంట్లకు సంబంధించిన రూ.200 కోట్ల విలువైన దుప్పట్లు, ఇతర దుస్తుల పంపిణీకి సంబంధించిన ఆర్డర్‌ను సైతం టెస్కోకు ఇవ్వకపోవడం కార్మికులను సంక్షోభంలోకి నెట్టివేయడమేనని ధ్వజమెత్తారు. గడువు ముగిసినప్పటికీ టెస్కోకు ఆర్డర్లు ఇవ్వకుండా ఆ సంస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని అన్నారు. తమకు కావాల్సిన ప్రైవేటు వ్యక్తులకు ఈ ఆర్డర్లను ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. చేనేత కార్మికులకు అన్యాయం చేసే చర్యను వెంటనే ఉపసంహరించుకోవాలని లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

## ఐదు మండలాల్లో 'భూభారతి' పైలట్

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఈవార్తలు): రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించే మరో కీలక అడుగు పడనుంది. ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పేరుతో సమీకృత భూ భారతి పోర్టల్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. గురువారం నుంచి ఐదు మండలాల్లో.. ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణపేట జిల్లా కొస్గీలో ప్రయోగాత్మకంగా పోర్టల్ సేవలను ప్రారంభించింది. సర్వే, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలకు సంబంధించిన సమాచారాన్ని ఒకేచోట నిక్షిప్తం చేస్తూ దీనిని రూపొందించింది. పైలట్ ప్రాజెక్టులో వచ్చే ఫలితాల ఆధారంగా మార్పులు చేసి, భవిష్యత్‌లో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనుంది. భూపరిపాలనకు సంబంధించిన సమాచారమే కాకుండా సర్వే వివరాలు, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన సమాచారం కూడా ఈ పోర్టల్‌లో అందుబాటులో ఉంటుంది. మైల్యాండ్ పోర్ట్‌ఫోలియో, నాలా ఆర్డర్లు, రిజిస్టర్డ్ డాక్యుమెంట్ల వివరాలు, ఫీడ్‌బ్యాక్, అధికారుల వివరాలు, ఆర్‌వోఆర్-1బీ, ఎల్‌పీఎం (భూదార్), దరఖాస్తులు, సిటిజన్ చార్టర్, డౌన్‌లోడ్స్, మ్యూటేషన్ ఆర్డర్లు, భూముల మార్కెట్ విలువలు, భూనక్షా, ధరణి కంటే ముందునాటి ఈసీలు, ఫీజుల రీఫండ్ వివరాలతో కూడిన 15 అంశాలతో ఈ పోర్టల్ డ్యాష్‌బోర్డు ఉంటుంది. ఒక్కో అంశంపై క్లిక్ చేస్తే దానికి సంబంధించిన సమగ్ర సమాచారం లభిస్తుంది.

## కరెంట్ షాక్‌తో చనిపోతే 8 లక్షలు

**రెండు నెలల్లోనే బాధితులకు చెల్లింపు**

**విద్యుత్తు ఛార్జీల పెంపు లేదు.. టీ-ఈఆర్సీ కీలక నిర్ణయాలు**

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఈవార్తలు): తెలంగాణలో విద్యుత్ వినియోగదారులకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) ఒకేసారి రెండు శుభవార్తలు అందించింది. రాష్ట్రంలో ఎవరైనా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మరణిస్తే ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను భారీగా పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో పాటు ఈ ఏడాది కరెంట్ ఛార్జీల పెంపు ఉండబోదని స్పష్టం చేసి ప్రజలకు పెద్ద ఊరటనిచ్చింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన టారిఫ్ ఆర్డర్‌ను తాజాగా ఈఆర్సీ విడుదల చేసింది. ఇప్పటివరకు విద్యుత్ షాక్‌తో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తుండగా, దానిని మరో రూ.3 లక్షలు పెంచి రూ.8 లక్షలు చేసింది. ఈ పెంచిన పరిహారం ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. బాధితుడి కుటుంబానికి రెండు నెలల్లోపే ఈ సొమ్మును అందించాలని, జాప్యం జరిగితే అందుకు గల కారణాలను లిఖితపూర్వకంగా వివరించాలని డిస్కంలను ఆదేశించింది. వినియోగదారుడి తప్పిదం వల్ల ప్రమాదం సంభవించినా ఈ పరిహారం వర్తిస్తుందని స్పష్టం చేయడం గమనార్హం. మరోవైపు ఈ ఏడాది కూడా పాత కరెంట్ ఛార్జీలనే కొనసాగించాలని ఈఆర్సీ నిర్ణయించింది. ఛార్జీల పెంపు ప్రతిపాదన ఏదీ లేదని స్పష్టం చేసింది. దీంతో పాటు ఇళ్ల పైకప్పులపై ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్లాంట్ల వినియోగదారులకు ఊరట కల్పించింది. అదనపు యూనిట్ల వాడకంపై అధిక శ్లాబుల ప్రకారం వసూలు చేసిన అదనపు మొత్తాన్ని రాబోయే మూడు నెలల బిల్లుల్లో సర్దుబాటు చేయాలని డిస్కంలను ఆదేశించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ కొనుగోలుకు రూ.49,230 కోట్లకు, ఇతర వ్యయాలతో కలిపి మొత్తం రూ.64,950 కోట్లకు ఈఆర్సీ ఆమోదం తెలిపింది. అయితే, టీఎస్ఎన్‌పీడీసీఎల్, టీఎస్ఎస్‌పీడీసీఎల్‌ల ఆదాయ, వ్యయాల మధ్య సుమారు రూ.15,106 కోట్ల లోటు ఏర్పడుతుందని ఈఆర్సీ అంచనా వేసింది. ఈ లోటును భర్తీ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం రూ.14,000 కోట్ల ఆర్థిక సహాయం అందించడానికి అంగీకరించిందని తెలిపింది. మిగిలిన లోటును డిస్కంల రెగ్యులేటరీ ఆస్తిగా పరిగణించాలని సూచించింది.

## ఐదేళ్ల ప్రేమ.. పెళ్లి.. 50 రోజులకే ఆత్మహత్య



మియాపూర్-హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఈవార్తలు): ఐదేళ్ల పాటు ప్రేమించుకుని, పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్న జంట కథ విషాదాంతంగా ముగిసింది. వివాహమైన 50 రోజులకే యువతి బలవన్మరణానికి పాల్పడింది. అదనపు కట్నం కోసం భర్త వేధిస్తుండటంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంది. ఈ దారుణ ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన ఇషిక యాదవ్ (26), మధ్యప్రదేశ్‌కు చెందిన నీరజ్ బన్సాల్ ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఫేస్‌బుక్ ద్వారా వీరి పరిచయం మొదలైంది. ఇద్దరూ హైదరాబాద్‌లోనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. కుటుంబ సభ్యులను ఒప్పించి ఈ ఏడాది ఫిబ్రవరి 10న పాట్నాలో వివాహం చేసుకున్నారు. అనంతరం మియాపూర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో కాపురం పెట్టారు. పెళ్లయిన కొన్ని రోజుల నుంచే నీరజ్ తన నిజస్వరూపాన్ని బయటపెట్టాడు. అదనపు కట్నం కింద బంగారం, వజ్రాభరణాలు, నగదు తీసుకురావాలంటూ ఇషికను మానసికంగా వేధించడం ప్రారంభించాడు. ఈ వేధింపులు భరించలేక బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయింది. బంధువులు గమనించి ఆమెను ఆసుపత్రికి తరలించినా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తమ కుమార్తె మృతికి ఆమె భర్త నీరజ్ వేధింపులే కారణమని ఇషిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు కృషి

**బీజేపీ ఎంపీ డాక్టర్ కే లక్ష్మణ్**

న్యూఢిల్లీ: దూరదృష్టి గల నాయకుడిగా ఆనాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబునాయుడు కృషి చేశారని, విభజన తర్వాత ఏపీకి అమరావతి రాజధానిగా సంకల్పం తీసుకుని ముందుకు సాగుతున్నారని తెలంగాణ బీజేపీ నాయకుడు, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. అమరావతికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారని, రెండు రాష్ట్రాల అభివృద్ధికి ఎన్డీయే కట్టుబడి ఉందని అన్నారు. అమరావతి చట్టబద్ధత బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ కోసం వికసిత్ రాజధాని అవసరమని ఆయన అన్నారు. రాజధాని అమరావతి కోసం 29 వేలమంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని గుర్తు చేశారు. భవ్య రాజధాని కోసం ఏపీ ప్రజలు కలలు కన్నారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ సంకల్పం సాకారమయ్యేందుకు వికసిత్ ఆంధ్ర నిర్మాణం అవశ్యమన్నారు. రాజధాని అవసరమని, కానీ జగన్ తన హయాంలో మూడు ముక్కలాడి రైతులు, మహిళలను ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. రాజధాని కోసం చాలాకాలంగా పోరాడిన మహిళలకు, రైతులకు ఆయన శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. అమరావతి బిల్లు కోసం దేశం మొత్తం ఆసక్తిగా చూస్తోందని అన్నారు. తెలుగు వారికి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కావాలని నాడు పొట్టి శ్రీరాములు 58 రోజులు నిరాహార దీక్ష చేసినా, నాటి కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించలేదని మండిపడ్డారు. ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన ప్రాణాలు త్యాగం చేశారని అన్నారు. ఆయన మరణానంతరం ప్రభుత్వం స్పందించి ఆంధ్ర రాష్ట్రం ఇచ్చిందని అన్నారు.




## బీజేపీ మండల అధ్యక్షుడిపై దాడి

**అక్రమ వెంచర్ల ను ప్రశ్నించినందుకే**

కొడిమ్యాల, ఏప్రిల్ 2 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల బీజేపీ అధ్యక్షుడు, అప్పారావుపేట గ్రామ సర్పంచ్ వినీల భర్త బండ నరసింహారెడ్డిపై దాడి జరిగింది. గురువారం సాయంత్రం పూడూరు గౌరపూర్ గ్రామాలకు చెందిన బండ ఎల్లారెడ్డి, బండ రవీందర్ రెడ్డి దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. పూడూరు శివారులోని సర్వే నంబరు 460, 461, 462, 463లలో ఉన్న అసైన్డ్ భూమిలో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తున్న సమయంలో ఎల్లారెడ్డి, రవీందర్ రెడ్డి.. నరసింహారెడ్డిని బూతులు తిడుతూ వెనకనుండి వచ్చి దాడి చేశాడు. ఈ దాడిలో నరసింహారెడ్డి తీవ్రంగా గాయపడటంతో ఆయనను స్థానికులు చికిత్స నిమిత్తం జగిత్యాల హాస్పిటల్‌కు తరలించారు. దాడి చేసిన వ్యక్తులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు బాధితుడు తెలిపాడు.

## కేవైసీ లోపంతో శ్రామికులకు ఇబ్బందులు



కాకినాడ, ఏప్రిల్ 2 (ఈవార్తలు): ఏపీలోని కాకినాడ జిల్లా ఉప్పాడ కొత్తపల్లి మండలం పరిధిలోని అమరవిల్లిలో వికసిత భారత్ ఉపాధి పథకం కింద ఎంపికైన శ్రామికులకు కేవైసీ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గ్రామంలో మొత్తం 116 మంది శ్రామికులను ఈ పథకం కింద ఎంపిక చేశారు. అయితే, కేవైసీ ప్రక్రియ పూర్తి కాని కారణంగా పలువురు శ్రామికులు పథకం లబ్ధిని పొందలేకపోతున్నారు. ఇందులో ముఖ్యంగా, 10 మంది శ్రామికులకు కంటి పరీక్షలు నిర్వహించకపోవడం సమస్యగా మారింది. కేవైసీ ఆలస్యం వల్ల ఆరోగ్య సేవల అమలు కూడా ప్రభావితమైంది. శ్రామికులు, గ్రామస్థులు ఈ సమస్యపై ఆందోళన వ్యక్తం చేశారు. 'కేవైసీ పూర్తి చేయడంలో సరైన మార్గదర్శకాలు లేవు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలి' అని కోరారు.

## కల్తీ బేకరీ ఉత్పత్తుల కేంద్రంపై దాడి

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని తప్పచబుత్రలోని నటరాజ్ నగర్‌లో ఉన్న చాంద్ బేకరీపై అధికారులు ఆకస్మిక దాడి చేశారు. అక్రమంగా, అత్యంత అపరిశుభ్రమైన పరిస్థితుల్లో బిస్కెట్లు, ఇతర బేకరీ ఉత్పత్తులను తయారు చేస్తున్నారన్న సమాచారంతో తనిఖీ చేయగా.. కల్తీ ఉత్పత్తులు బయటపడ్డాయి. తనిఖీల్లో రూ. 2.77 లక్షల విలువైన కల్తీ సరుకును స్వాధీనం చేసుకుని, యజమాని సయ్యద్ ఖదీర్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

## అమరావతిపై రాజకీయ విమర్శలు వద్దు: ఆర్ కృష్ణయ్య

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి అభివృద్ధి అవశ్యమని, దీనిని రాజకీయ కోణంలో చూసి విమర్శలు చేయవద్దని బీజేపీ రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. అమరావతి చట్టబద్ధత బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏపీ రాజధానిగా అమరావతికి పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రం మధ్యలో అమరావతి ఉంటుందని, పాలనాపరంగా సౌలభ్యంగా ఉంటుందని అన్నారు. రాజధాని అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో కృషి చేశారని అన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన రాజధానిని అందరూ సమర్థించాలని కోరారు. తెలుగు రాష్ట్రాలకు కేంద్రం అన్ని విధాలుగా సహకరిస్తోందని అన్నారు. నిధులు సమకూరుస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేయడాన్ని మనం చూశామని, అలాగే అమరావతిని అభివృద్ధి చేయాలనే తపన ప్రధాని మోదీకి కూడా ఉందని అన్నారు. బలహీనవర్గాల రాజధానిగా అమరావతి రూపుదిద్దుకుంటుందన్న నమ్మకం ఉందని ఆర్ కృష్ణయ్య అన్నారు. అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా చేయడంలో చంద్రబాబు విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీ రాజధాని అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. రాజధాని అభివృద్ధిని రాజకీయాలకు అతీతంగా చూడాలని ఆర్ కృష్ణయ్య అన్నారు.

## 30 ఏళ్ల తర్వాత మళ్లీ హిందూమతంలోకి

భూమన చొరవతో సనాతన ధర్మంలోకి బాల్య స్నేహితుడు

తిరుపతి, ఏప్రిల్ 2 (ఈవార్తలు): తిరుపతిలో ఒక ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. టీటీడీ మాజీ ఛైర్మన్, తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి నివాసంలో 'హిందూమత పున:స్వీకరణ మహోత్సవం' జరిగింది. 30 ఏళ్ల క్రితం ఇస్లాం మతం స్వీకరించిన ఓ జంట, భూమన చొరవతో తిరిగి సనాతన ధర్మంలోకి వచ్చారు. ఈ సందర్భంగా భూమన తన నివాసంలో ప్రత్యేక హోమం నిర్వహించి వారిని హిందూ మతంలోకి ఆహ్వానించారు. తిరుపతికి చెందిన శ్రీనివాసులు రెడ్డి, పుష్ప దంపతులు సుమారు 30 ఏళ్ల క్రితం జీవనోపాధి కోసం కువైట్ వెళ్లారు. అక్కడి పరిస్థితుల దృష్ట్యా వారు ఇస్లాం మతం స్వీకరించి, తమ పేర్లను అబ్దుల్లా, అమీనాగా మార్చుకున్నారు. ఐదేళ్ల క్రితం తిరిగి స్వస్థలానికి వచ్చిన వీరు తిరుపతిలోని పీకే లేఅవుట్‌లో నివాసం ఉంటున్నారు. శ్రీనివాసులు రెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి చిన్ననాటి స్నేహితులు. చాలా ఏళ్ల తర్వాత వీరిద్దరూ తిరుపతిలో కలుసుకున్నారు. ఈ క్రమంలో తన స్నేహితుడు మతం మారాడని తెలుసుకున్న భూమన, తిరిగి హిందూ ధర్మంలోకి రావాలని కోరారు. ముఖ్యంగా గత రెండేళ్లుగా ఆయన పదేపదే విజ్ఞప్తి చేయడంతో శ్రీనివాసులు రెడ్డి దంపతులు ఆలోచించి సనాతన ధర్మంలోకి తిరిగి రావాలని నిర్ణయించుకున్నారు. ఈ నిర్ణయాన్ని భూమనకు తెలుపగా, ఆయన తన పద్మావతిపురంలోని నివాసంలోనే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ.. "కువైట్‌లో పరిస్థితుల వల్ల ఇస్లాం స్వీకరించాల్సి వచ్చింది. నా బాల్య స్నేహితుడు భూమన రెండేళ్లుగా తిరిగి హిందూ మతంలోకి రావాలని ఒత్తిడి తెచ్చారు. ఆయన ప్రోత్సాహంతో ఇప్పుడు మనస్ఫూర్తిగా సొంత మతంలోకి రావడం ఎంతో ఆనందంగా ఉంది. ఇకపై సగర్వంగా తిరుపతి కొండకు వెళతాను" అని తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ.. తాను, శ్రీనివాసులు రెడ్డి 50 ఏళ్లుగా స్నేహితులమని చెప్పారు. "గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ ఆదేశాలతో 60 మంది పీఠాధిపతులతో సదస్సు నిర్వహించాం. ఇతర మతాల్లోకి వెళ్లిన వారిని తిరిగి హిందూ మతంలోకి తీసుకురావడానికి ఒక ప్రత్యేక వేదిక ఏర్పాటు చేయాలని ఆ సదస్సులో తీర్మానించాం. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చి రెండేళ్లు అవుతున్నా ఆ నిర్ణయాన్ని అమలు చేయలేదు. ప్రభుత్వం ఆ పని చేయకపోయినా, జగన్ ఆశయానికి అనుగుణంగా నా స్నేహితుడిని తిరిగి హిందూ ధర్మంలోకి తీసుకురావడం ఎంతో సంతృప్తినిచ్చింది" అని భూమన వ్యాఖ్యానించారు.

## ఏపీలో 482 మంది డాక్టర్లకు కొలువులు

**15 రోజుల్లోగా విధుల్లో చేరాలని ఆదేశం**

విజయవాడ, ఏప్రిల్ 2 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో వైద్య రంగాన్ని బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 482 మంది వైద్యులకు రెగ్యులర్ ప్రాతిపదికన నియామక ఉత్తర్వులను జారీ చేసినట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నిన్న ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉత్తర్వులు అందుకున్న వారు 15 రోజుల్లోగా తమకు కేటాయించిన విధుల్లో చేరాలని ఆయన సూచించారు. గత ఏడాది విడుదల చేసిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా ఈ నియామకాలు జరిగాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) మెడికల్ ఆఫీసర్లు, బోధనాసుపత్రుల్లో ట్యూటర్ల వంటి మొత్తం 636 ఖాళీల భర్తీకి ఈ ప్రక్రియను చేపట్టారు. ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా, పూర్తిగా పారదర్శకంగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగులు కేటాయించడం గమనార్హం. ఈ పోస్టుల కోసం దాదాపు 5,000 మంది ఎంబీబీఎస్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, రిజర్వేషన్ నిబంధనలను అనుసరించి తుది జాబితాను సిద్ధం చేశారు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో 611 పోస్టులకు గాను 482 మంది అభ్యర్థులు తమ ఐచ్ఛికాలను (వెబ్ ఆప్షన్లు) ఎంచుకున్నారు. వారికి తక్షణమే నియామక ఉత్తర్వులను జారీ చేశారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డీపీహెచ్) వెల్లడించిన వివరాల ప్రకారం, అత్యధికంగా కడప జిల్లాకు 52 మంది వైద్యులను కేటాయించారు. ఆ తర్వాతి స్థానాల్లో అనంతపురం (34), శ్రీకాకుళం (31), కాకినాడ (29), కర్నూలు (27) జిల్లాలు ఉన్నాయి.





# ఇక అమరావతికి తిరుగులేదు

**రాష్ట్రానికి కొత్త శకం మొదలైంది.. ఏపీ సీఎం చంద్రబాబు**



అమరావతి, ఏప్రిల్ 2 (ఈవార్తలు): రాజ్యసభలో గురువారం అమరావతి బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక చారిత్రక, నిర్వచనాత్మక ఘట్టమని సీఎం చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. అమరావతికి తిరుగులేదని, అది ఆంధ్రప్రదేశ్ హృదయమని, భవిష్యత్తులో దేశానికే గర్వకారణంగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, 2026 పార్లమెంట్ ఉభయ సభల్లో ఏకగ్రీవంగా ఆమోదం పొందడం ద్వారా ప్రజల సమష్టి ఆకాంక్షలకు జాతీయ స్థాయిలో బలమైన గొంతుక లభించిందని చంద్రబాబు పేర్కొన్నారు. "రాష్ట్ర విభజన తర్వాత రాజధాని లేకుండా ఆంధ్రప్రదేశ్ అనేక సవాళ్లు, అనిశ్చితులను ఎదుర్కొంది. ఈ క్లిష్ట సమయంలో అమరావతి రైతులు చేసిన అసమానమైన త్యాగం, చూపిన విశ్వాసం, కనబరిచిన ధైర్యమే ఈ కలను సజీవంగా నిలిపాయి. ఈ చారిత్రక విజయం వారికే అంకితం," అని ఆయన అన్నారు. ఈ నిర్ణయంతో రాష్ట్రానికి దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న స్థిరత్వం లభించిందని, ప్రతి పౌరుడికి సాధికారత, ఆత్మవిశ్వాసం, ప్రగతితో కూడిన కొత్త శకానికి నాంది పలికిందని తెలిపారు. "అమరావతి రాజధాని హోదా ఇప్పుడు ఎలాంటి సందేహాలకు, చర్చలకు, మార్పులకు తావులేకుండా పటిష్టంగా స్థిరపడింది" అని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ఆకాంక్షలకు అండగా నిలిచిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి చంద్రబాబు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 2015 అక్టోబర్ 22న అమరావతికి శంకుస్థాపన చేసిన నాటి నుంచి, 2025 మే 2న దాని పురోగతికి పునరుజ్జీవం పోసే వరకు ప్రతి కీలక దశలోనూ ప్రధాని మోదీ అమరావతికి అండగా నిలిచారని కొనియాడారు. ఈ బిల్లు ముందుకు సాగడంలో కీలక పాత్ర పోషించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు, కేంద్ర ప్రభుత్వానికి కూడా ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. విభేదాలను పక్కనపెట్టి అమరావతిని ఏకైక 'ప్రజా రాజధాని'గా పునరుద్ఘాటించిన అన్ని పార్టీలు, పార్లమెంట్ సభ్యులకు చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం రాజ్యసభలో ఈ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించినట్లు సభాధ్యక్షులు సి.పి. రాధాకృష్ణన్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఎన్డీయే సభ్యులు హర్షధ్వానాలు చేశారు. దీంతో అమరావతి ఆంధ్రప్రదేశ్ ఏకైక, శాశ్వత రాజధానిగా చట్టబద్ధమైన గుర్తింపు పొందింది.

# 7,358 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదల!

**గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఏపీ సీఎం చంద్రబాబు**



అమరావతి, ఏప్రిల్ 2 (ఈశార్తలు): ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులపై గురువారం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్థిక శాఖపై సమీక్షించారు. ఈ మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఆరా తీశారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులు జరపాలని గతంలో ఇచ్చిన ఆదేశాలను ఏ మేరకు అమలు చేశారని అడిగారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు కసరత్తు చేశామని, నిధుల లభ్యతను బట్టి చెల్లింపులను జరుపుతున్నామని అధికారులు వివరించారు. ఉద్యోగులకు రిలీఫ్ ఇచ్చేలా మొత్తంగా రూ. 7,358 కోట్ల మేర పెండింగ్ బిల్లుల విడుదలకు చర్యలు తీసుకున్నామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. దీంట్లో భాగంగా ఇప్పటికే ప్రావిడెంట్ ఫండ్ బకాయిల కింద రూ. 1,848 కోట్లను నేరుగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేశామని, అలాగే గ్రూప్ లైఫ్ ఇన్సూరెన్స్ కింద 4,793 మందికి సంబంధించిన రూ. 76 కోట్ల చెల్లింపులు కూడా పూర్తి చేశామని వెల్లడించారు. వీటితో పాటు గ్రాట్యుటీ బకాయిల కింద రూ. 3,411 కోట్లు, పెండింగులో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కింద రూ. 1,800 కోట్లు, పోలీస్ శాఖకు సంబంధించి అదనపు సరెండర్ లీవుల నిమిత్తం రూ. 223 కోట్ల బిల్లుల విడుదల ప్రక్రియ కొనసాగుతోందని మరో రెండు రోజుల్లో చెల్లింపులు పూర్తి చేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి చెప్పారు. తల్లికి వందనం తర్వాత ఒకేసారి ఇంత పెద్ద మొత్తంలో చెల్లింపులు జరుపుతోంది ఉద్యోగులకు మాత్రమేనని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. నిధుల లభ్యతను బట్టి ఉద్యోగుల పెండింగ్ బిల్లుల సహా అన్ని రకాల పెండింగ్ బిల్లులకు చెల్లింపులు జరపాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల విషయంలో జరిగిన పరిణామాలు ప్రస్తావనకు వచ్చాయి. నాడు ఉద్యోగుల సొంత సొమ్మును కూడా నాటి ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించడంతో వారు తీవ్ర ఇబ్బందులుపడ్డారని, తమ నిధుల కోసం ప్రశ్నించిన నేతలపై కేసులు పెట్టి వేధించారనే అంశం చర్చకు వచ్చింది. ఇదే సమీక్షా సమావేశంలో వివిధ పనులు చేసిన కాంట్రాక్టర్లకు, మెటీరియల్ సరఫరా చేసిన వారికి జరపాల్సిన చెల్లింపులపైనా ముఖ్యమంత్రి ఆరా తీశారు. వివిధ శాఖలకు మెటీరియల్ సరఫరా చేసిన చిన్న చిన్న కాంట్రాక్టర్లకు రూ. 614 కోట్ల బకాయిల చెల్లింపులు జరిపామని అధికారులు తెలిపారు. పనులు చేసిన, మెటీరియల్ సరఫరా చేసిన వాళ్లకు బిల్లులు చెల్లింపులు జరిపే ప్రక్రియలో చిన్న కాంట్రాక్టర్లకు పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# ఏకైక రాజధానిగా అమరావతి

**ఏపీ డిప్యూటీ సీఎం పవన్**

అమరావతి, ఏప్రిల్ 2 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే కీలక బిల్లు రాజ్యసభలోనూ ఆమోదం పొందింది. లోక్‌సభలో ఇప్పటికే ఆమోదం పొందిన ఈ బిల్లు, గురువారం పెద్దల సభలోనూ నెగ్గడంతో అమరావతికి రాజధానిగా తిరుగులేని చట్టపరమైన హోదా లభించింది. ఈ చారిత్రక పరిణామం పట్ల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఇది ఐదు కోట్ల ఆంధ్రుల విజయమని, ప్రజల ఆత్మగౌరవ పునరుద్ధరణ అని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. "త్యాగాల పునాదుల నుంచి, ఆశలు మోసుకొచ్చిన కన్నీటి నుంచి, అనిశ్చితిని భరించిన నిశ్శబ్దం నుంచి అమరావతి నేడు కోట్లాది ప్రజల ఆశలను మోస్తూ గౌరవంగా నిలబడింది" అని భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. గత కొన్నేళ్లుగా రాజధాని ఉనికిపై సాగిన కుట్రలు, అపోహలు, న్యాయపరమైన చిక్కులను అధిగమించి, పార్లమెంట్ సాక్షిగా అమరావతి ఒక అజేయ శక్తిగా అవతరించిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఎట్టకేలకు న్యాయం జరిగిందని, ఈ విజయం ఎన్డీఏ ప్రభుత్వంపై చెక్కుచెదరని విశ్వాసం ఉంచిన ప్రతి పౌరుడిదని తెలిపారు. అమరావతి ఆత్మ రైతుల త్యాగంలోనే ఉందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. "33,000 ఎకరాలకు పైగా భూములను రైతులు బలవంతంగా ఇవ్వలేదు. భవిష్యత్‌పై, ఒక దార్శనికతపై నమ్మకంతో ఇచ్చారు. ఈ రోజు వారి నమ్మకాన్ని గౌరవించగలిగాం" అని పేర్కొన్నారు. ఈ చారిత్రక ఘట్టంలో రాష్ట్రానికి గుర్తింపు కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఆయన నివాళులు అర్పించారు. గత కొన్నేళ్లుగా అమరావతిని అనిశ్చితిలోకి నెట్టారని, విధానాలు మార్చి రైతులను మోసం చేశారని, ప్రజల ఆకాంక్షలను నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఆ అనిశ్చితికి తెరపడిందన్నారు. ఇది కేవలం రాజధాని పునరుద్ధరణ మాత్రమే కాదని, ప్రజల ఆత్మగౌరవ పునరుద్ధరణ అని పేర్కొన్నారు. స్పష్టమైన దార్శనికతతో అమరావతి అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ప్రతి కీలక సమయంలో రాష్ట్రానికి అండగా నిలిచిన ప్రధాని నరేంద్ర మోదీకి, ఎన్డీఏ ప్రభుత్వానికి, బిల్లుకు మద్దతిచ్చిన అన్ని రాజకీయ పార్టీలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై అమరావతి స్థిరత్వం, ప్రగతికి చిహ్నంగా, తరతరాలకు వారధిగా నిలిచే ప్రజల రాజధాని అవుతుందని పవన్ కల్యాణ్ ధీమా వ్యక్తం చేశారు.



## అమరావతి పేరుతో పెద్ద డ్రామా

**రాజ్యసభలో వైవీ సుబ్బారెడ్డి విమర్శలు**

న్యూఢిల్లీ: అమరావతి పేరుతో పెద్ద డ్రామా చేశారు. శాసన ప్రక్రియను పాటించలేదు. ప్రస్తుత రూపంలోని అమరావతి బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి అన్నారు. గురువారం రాజ్యసభలో అమరావతి రాజధాని చట్టబద్ధత బిల్లుపై జరిగిన చర్చలో వైవీ సుబ్బారెడ్డి మాట్లాడారు. మండలిలో చర్చించకుండా తీర్మానం చేశారు. రాజధాని నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిదని.. కేంద్ర ప్రభుత్వమే అఫిడవిట్ దాఖలు చేసింది. ఇప్పుడెలా రాజధానిపై బిల్లును ప్రవేశపెట్టారు. రైతుల నుంచి 50వేల ఎకరాలు తీసుకున్నారు. ఇప్పటివరకు శాశ్వత నిర్మాణాలు జరగలేదు. ఒక్కో ఎకరానికి రూ. 2 కోట్లు ఖర్చు అవుతుందని చెప్తున్నారు. రూ. 2లక్షల కోట్లు ఎక్కడి నుంచి తెస్తారు?. ఇప్పటికే వడ్డీలకు రూ. 20వేల కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి. అమరావతి కోసం ఎనిమిదేళ్లలో రూ. 7వేల కోట్లు ఖర్చు చేశారు. రెండేళ్లలోనే రూ. 3.40లక్షల కోట్లు అప్పు చేశారు. వరదలతో మునిగిపోతుందని ఆధారాలు ఉన్నాయి. అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసమే మేం మూడు రాజధానులు చెప్పాం. అమరావతిని శాసన రాజధానిగా పెట్టాం. విశాఖను ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా కర్నూల్‌ను జ్యూడీషియల్ క్యాపిటల్‌గా పెట్టాం. అమరావతిలో ప్రతి చదరపు అడుగుకు.. రూ. 12వేలకు పైగా ఖర్చుపెడుతున్నారు.

## పోలవరం డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి

పోలవరం, ఏప్రిల్ 2 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలన్న ప్రభుత్వ సంకల్పంలో నేడు మరో కీలక ఘట్టం పూర్తయిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత కీలకమైన 1,372 మీటర్ల పొడవైన 'డయాఫ్రం వాల్' నిర్మాణాన్ని ఇరిగేషన్ శాఖ తక్కువ సమయంలో పూర్తి చేసిందని ప్రశంసించారు. ఇందుకు ఇరిగేషన్ శాఖ అధికారులకు, ఇంజనీర్లకు ఆయన అభినందనలు తెలిపారు. దీనికి సహకరించిన కేంద్ర సంస్థలకు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ ప్రతినిధులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా డీ-వాల్ దెబ్బతినడంతో అదనంగా రూ. 1000 కోట్లు వెచ్చించి నిర్మించామని పేర్కొన్నారు.

# న్యాయాధికారుల నిర్బంధం

## బెంగాల్ సర్కార్‌పై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాలో ఏడుగురు న్యాయాధికారులను గంటల తరబడి బందీలుగా పట్టుకున్న ఘటనపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఇది కేవలం న్యాయాధికారులను భయపెట్టే ప్రయత్నమే కాదని, సుప్రీంకోర్టు అధికారానికే సవాల్ విసిరేలా ఉందని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) లేదా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)తో విచారణ జరిపించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. దర్యాప్తును తామే పర్యవేక్షిస్తామని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే... ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా తమ పేర్లను తొలగించారంటూ ఆగ్రహించిన కొందరు నిరసనకారులు.. మాల్దాలో ముగ్గురు మహిళలు సహా ఏడుగురు జ్యుడీషియల్ అధికారులను బుధవారం మధ్యాహ్నం ఘెరావ్ చేశారు. దాదాపు 9 గంటల పాటు వారిని నిర్బంధించారు. అర్ధరాత్రి 1 గంట సమయంలో భారీ పోలీస్, పారామిలటరీ బలగాలు రంగంలోకి దిగి వారిని సురక్షితంగా విడిపించాయి. అధికారులను అక్కడి నుంచి తరలిస్తుండగా వారి వాహనాలపై రాళ్లు, కర్రలతో దాడులు జరిగాయి. ఈ ఘటనలో ఓ కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనను సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. "సాయంత్రం 5 గంటలకు అధికారులను నిర్బంధిస్తే, రాత్రి 11 గంటల వరకు వారికి సహాయం అందలేదు. ఇది సాధారణ ఘటన కాదు. న్యాయాధికారుల మనోధైర్యాన్ని దెబ్బతీసి, కొనసాగుతున్న ప్రక్రియను అడ్డుకోవడానికి ఉద్దేశపూర్వకంగా, ప్రణాళికాబద్ధంగా చేసిన దాడిలా కనిపిస్తోంది" అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. కలకత్తా హైకోర్టు చీఫ్ జస్టిస్ స్వయంగా డీజీపీ, హోం సెక్రటరీకి ఫోన్ చేయాల్సి వచ్చిందని ఆయన గుర్తుచేశారు. ఈ ఘటనలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తన విధిని నిర్వర్తించడంలో పూర్తిగా విఫలమైందని కోర్టు అభిప్రాయపడింది. అధికారులకు భద్రత కల్పించడంలో ఎందుకు విఫలమయ్యారో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఇకపై అభ్యంతరాల స్వీకరణ సమయంలో ఇద్దరు, ముగ్గురి కంటే ఎక్కువ మందిని అనుమతించరాదని, విచారణ కేంద్రాల వద్ద ఐదుగురి కంటే ఎక్కువ



మంది గుమికూడరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ సమయంలో బెంగాల్ అడ్వొకేట్ జనరల్ జోక్యం చేసుకోగా, సీజేఐ తీవ్రంగా స్పందించారు. "దురదృష్టవశాత్తు మీ రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ రాజకీయ భాషలోనే మాట్లాడతారు. దేశంలోనే అత్యంత ధ్రువీకరించబడిన రాష్ట్రం మీది. అర్ధరాత్రి 2 గంటల వరకు నేనే స్వయంగా పరిస్థితిని పర్యవేక్షించాను. ఆ దుండగులు ఎవరో మాకు తెలియదనుకుంటున్నారా? ఇది చాలా దురదృష్టకరం" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. న్యాయవ్యవస్థపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

## చంద్రుడి వద్దకు ఐఫోన్లు

### తొలిసారిగా నాసా కీలక నిర్ణయం

నాసా: అంతరిక్ష ప్రయోగాల్లో అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా) మరో చారిత్రక మార్పుకు శ్రీకారం చుట్టింది. చరిత్రలో తొలిసారిగా, లోతైన అంతరిక్షంలోకి (డీప్ స్పేస్) వెళ్తున్న తమ వ్యోమగాములకు వ్యక్తిగత ఐఫోన్లు తీసుకువెళ్లేందుకు అనుమతి ఇచ్చింది. ఫ్లోరిడాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి బుధవారం నింగిలోకి దూసుకెళ్లిన ఆర్టెమిస్-2 మిషన్‌లో ఈ కొత్త విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ మిషన్ ద్వారా మానవసహిత యాత్ర 50 ఏళ్లకు పైగా విరామం తర్వాత చంద్రుడి సమీపంలోకి వెళ్తోంది. రీడ్ వైస్‌మన్, విక్టర్ గ్లోవర్, క్రిస్టినా కోచ్, జెరెమీ హాన్సెన్‌లతో కూడిన నలుగురు వ్యోమగాముల బృందం, ఓరియన్ స్పేస్‌క్రాఫ్ట్‌లో 10 రోజుల పాటు చంద్రుడి చుట్టూ ప్రయాణించి తిరిగి రానుంది. ఈ ప్రయాణంలో తమ వ్యక్తిగత క్షణాలను, అద్భుతమైన దృశ్యాలను బంధించేందుకు వీరికి ఐఫోన్లను ఉపయోగించుకునే వెసులుబాటు కల్పించారు. వ్యోమగాములు వినియోగించే పరికరాలను ఆధునికీకరించే ప్రణాళికలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు నాసా అడ్మినిస్ట్రేటర్ జారెడ్ ఐజాక్‌మన్ ఈ ఏడాది ఆరంభంలో ప్రకటించారు. "మా వ్యోమగాములు తమ కుటుంబం కోసం ప్రత్యేక క్షణాలను బంధించుకోవడానికి, ప్రపంచంతో స్ఫూర్తిదాయకమైన చిత్రాలు, వీడియోలను పంచుకోవడానికి అవసరమైన సాధనాలను అందిస్తున్నాం" అని ఆయన గతంలో ఎక్స్ (ట్విట్టర్) వేదికగా తెలిపారు. అయితే, అంతరిక్ష నౌకలోని వ్యవస్థలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు, డీప్ స్పేస్ ప్రయాణంలో ఈ ఫోన్లను పూర్తిగా 'ఏరోప్లేన్ మోడ్'లోనే ఉంచుతారు. అంటే ఇవి కేవలం హై-ఎండ్ కెమెరాలుగా మాత్రమే పనిచేస్తాయి. ప్రయాణ సమయంలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం మీదుగా వెళ్తున్నప్పుడు, అక్కడి వై-ఫైకి కనెక్ట్ అయి ఫొటోలు, ఈ-మెయిల్స్ పంపే అవకాశం ఉంటుంది. కానీ, వాయిస్ కాల్స్ చేసుకోవడం మాత్రం సాధ్యం కాదు. ఈ యాత్రలో వ్యోమగాములు చంద్రుడి ఉపరితలానికి సంబంధించిన లైవ్ చిత్రాలను తీయడంతో పాటు ఇంతకుముందు మానవ కంటికి కనిపించని కొన్ని ప్రదేశాలను గమనించనున్నారు. అలాగే, లోతైన అంతరిక్షం నుంచి పాక్షిక సూర్యగ్రహణాన్ని కూడా వీక్షించనున్నారు.

## రాజా రవివర్మ 'యశోదకృష్ణ'.. 167 కోట్లు

ముంబై: ప్రముఖ భారతీయ చిత్రకారుడు రాజా రవివర్మ గీసిన యశోద, చిన్నికృష్ణుడి పెయింటింగ్ వేలంలో రూ.167.2 కోట్లకు అమ్ముడుపోయింది. ముంబైలో సాఫ్రాన్ ఆర్ట్ స్ప్రింగ్ లైవ్ ఆక్షన్ నిర్వహించగా, రాజా రవివర్మ గీసిన ఈ చిత్రాన్ని దక్కించుకునేందుకు చాలామంది పోటీపడ్డారు. చివరకు దీనిని ప్రముఖ పారిశ్రామికవేత్త, సీరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకులు సైరస్ పూనావాలా దక్కించుకున్నారు. రాజా రవివర్మ ఈ ఆయిల్ పెయింటింగ్‌ను 1890లలో గీశారు. వేలంలో రూ.167 కోట్లు పలకడంతో అత్యంత ఖరీదైన ఆధునిక భారతీయ కళాఖండంగా యశోద, కృష్ణ చిత్రం నిలిచింది. గత సంవత్సరం ఎంఎఫ్ హుస్సేన్ గీసిన ఓ పెయింటింగ్ రూ.118 కోట్లకు అమ్ముడుపోయింది. దీనిని ఢిల్లీకి చెందిన కిరణ్ నాదర్ దక్కించుకున్నారు. పెయింటింగ్ కొనుగోలు చేయడం ఎంతో గౌరవంగా ఉందని, ఇది తన బాధ్యత అని సైరస్ పూనావాలా మీడియాతో మాట్లాడుతూ చెప్పారు.

# దేశాన్ని మళ్లీ నిర్మిద్దాం

## ఇరాన్ సుప్రీం మొజ్తబా పిలుపు

టెహ్రాన్: అమెరికా- జాయినిస్ట్ (అమెరికా, ఇజ్రాయిల్) శక్తులు ఎలాంటి రెచ్చగొట్టే చర్యలు లేకుండానే దాడులు చేసి విధ్వంసం సృష్టించాయని, ఈ దాడిలో ధ్వంసమైన మౌలిక సదుపాయాలను పునరుద్ధరించి దేశాన్ని పునర్నిర్మించేందుకు దేశవ్యాప్తంగా కృషి చేయాలని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ పిలుపునిచ్చారు. ఇస్లామిక్ రిపబ్లిక్ డే, జాతీయ ప్రకృతి దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆయన ఈ సందేశం ఇచ్చినట్లు ఆ దేశ అధికారిక మీడియా సంస్థ ప్రెస్ టీవీ ఒక కథనంలో వెల్లడించింది. ఇటీవలి ఘర్షణల తర్వాత దేశ భవిష్యత్ శ్రేయస్సు కోసం జాతీయ ప్రయత్నాలు సాగాలని ఆయన స్పష్టం చేశారు. దివంగత అయతొల్లా అలీ ఖమేనీ కుమారుడైన మొజ్తబా ఖమేనీ, శత్రువుల దాడులు కేవలం ప్రజలనే కాకుండా దేశ భూభాగాన్ని, సహజ పర్యావరణాన్ని కూడా లక్ష్యంగా చేసుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. "క్రూరమైన అమెరికా, జాయినిస్ట్ శత్రువులు తమ అనాగరిక చర్యలలో ఎలాంటి మానవ, నైతిక పరిమితులు పాటించడం లేదు. ఇలాంటి సమయంలో దేశం అంతర్గత అభివృద్ధిపై దృష్టి పెట్టాలి" అని ఆయన వ్యాఖ్యానించినట్లు ప్రెస్ టీవీ




పేర్కొంది. ఇరాన్ ఉజ్వల భవిష్యత్తు కోసం చేపట్టే ప్రతి ప్రయత్నం ఎంతో విలువైందని, అవసరమని ఆయన నొక్కిచెప్పారు. ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఈ ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి ఆయన తన సందేశంలో నివాళులర్పించారు. ముఖ్యంగా దేశంలోని దక్షిణ నగరమైన మినాబ్‌లోని ఒక బాలికల పాఠశాలపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ దాడిలో 186 మంది విద్యార్థినులు మరణించినట్లు ప్రెస్ టీవీ నివేదించింది. "పిల్లలను చంపే రాక్షస అమెరికా, జాయినిస్ట్ దుర్మార్గులు పాఠశాలలోని పసిమొగ్గలను కిరాతకంగా బలిగొన్నారు" అని ఖమేనీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళిగా, దేశవ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని ఆయన ప్రజలను కోరారు. కొనసాగుతున్న యుద్ధంలో మరణించిన వారి జ్ఞాపకార్థం ఇరాన్ ప్రజలు తమ భూమి అంతటా 'ఆశ అనే మొక్కను' నాటుతున్నారని ఆయన అన్నారు. ఈ మొక్కలు రాబోయే సంవత్సరాల్లో ఫలవంతమైన, ఆశీర్వాద వృక్షాలుగా ఎదుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రాంతీయ ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, నౌరోజ్ (వసంతకాల వేడుకలు) సందర్భంగా ఇరాన్ ప్రజలు దృఢమైన సంకల్పంతో, గౌరవంతో నిలబడ్డారని ఆయన ప్రశంసించారు.

# అబద్ధాలతో ఇరాన్‌పై అమెరికా యుద్ధం

## అణ్వాయుధాలు ఒక సాకు మాత్రమే.. బ్రెజిల్ అధ్యక్షుడు లూలా మండిపాటు

సియారా: ఇరాన్‌తో అనవసర యుద్ధానికి దిగేందుకు అమెరికా ఒక అబద్ధాన్ని సృష్టించిందని బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వా తీవ్ర ఆరోపణలు చేశారు. ఇరాన్ అణ్వాయుధాలను కలిగి ఉందని లేదా వాటిని తయారు చేయడానికి ప్రయత్నిస్తోందని అమెరికా చెబుతున్నది పచ్చి అబద్ధమని ఆయన స్పష్టం చేశారు. బుధవారం బ్రెజిల్‌లోని సియారా రాష్ట్రంలో



జరిగిన ఒక ఇంటర్వ్యూలో లూలా ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో ఇరాక్‌లో కూడా సామూహిక విధ్వంసక ఆయుధాలు ఉన్నాయంటూ అబద్ధాలు చెప్పి అమెరికా యుద్ధానికి దిగిందని, కానీ ఆ ఆయుధాలు ఎన్నడూ కనుగొనలేదని ఆయన గుర్తుచేశారు. "ఇదంతా కేవలం ఒక సాకు మాత్రమే... యుద్ధం ఎప్పుడూ దేనినీ పరిష్కరించలేదు" అని లూలా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వివాదంపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి హేతుబద్ధంగా ఆలోచించి, జోక్యం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ యుద్ధం వల్ల తమ దేశంపై ప్రత్యక్ష ప్రభావం పడుతోందని లూలా ఆవేదన వ్యక్తం చేశారు. హర్మూజ్ జలసంధి మూసివేతతో బ్రెజిల్‌లో డీజిల్ ధరలపై తీవ్ర ఒత్తిడి పెరిగిందన్నారు. తక్కువ ఆదాయం ఉన్న పౌరుల జీవనోపాధిని కాపాడేందుకు తమ ప్రభుత్వం ఇంధన పన్నులను తగ్గించి, మార్కెట్‌పై నిఘా పెంచిందని వివరించారు. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై సైనిక దాడులు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ దాడుల వల్ల ప్రపంచవ్యాప్తంగా నౌకా రవాణాకు అంతరాయం ఏర్పడి, చమురు ధరలు ఆకాశాన్నంటాయి. దీని ప్రభావంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడిదొడుకులకు లోనైంది. మరోవైపు ఈ దాడుల వల్ల ఇరాన్‌లో తీవ్ర ఆస్తినష్టం, మానవతా సంక్షోభం నెలకొన్నాయి. ఇరానియన్ రెడ్ క్రెసెంట్ సొసైటీ ప్రకారం బుధవారం నాటికి 1,15,000కు పైగా నివాస, వాణిజ్య, విద్యా, ఆరోగ్య భవనాలు దెబ్బతిన్నాయి. 700కు పైగా విద్యాసంస్థలు ధ్వంసమైనట్లు విద్యా మంత్రిత్వ శాఖ నివేదించింది. ఐక్యరాజ్యసమితి మానవతా వ్యవహారాల సమన్వయ కార్యాలయం కూడా ఇరాన్‌లో పరిస్థితిపై నివేదిక విడుదల చేసింది. వైమానిక దాడుల వల్ల 309 ఆరోగ్య కేంద్రాలు, 42 అంబులెన్సులు ధ్వంసమయ్యాయని, ఏడు ఆసుపత్రులను ఖాళీ చేయించారని పేర్కొంది.

# ఏడుగురు మహిళా కూలీల దుర్మరణం

## మహారాష్ట్ర సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వేపై ఘోరం

జల్నా: మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జల్నా జిల్లాలోని సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వేపై జరిగిన ఈ దుర్ఘటనలో ఏడుగురు మహిళా కూలీలు ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కడ్వాంచి గ్రామ సమీపంలో కూలీలతో వెళ్తున్న ఓ మినీ ట్రక్కును వేగంగా వచ్చిన మరో ట్రక్కు వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బాధితులంతా ఎక్స్‌ప్రెస్‌వే పనులకు వెళ్తున్న కూలీలు. వారు ప్రయాణిస్తున్న మినీ ట్రక్కును ముంబై వైపు వెళ్తున్న ఓ భారీ ట్రక్కు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు ఏడుగురు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా, తలలకు గాయాలు, ఫ్రాక్చర్లతో మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని, గాయపడిన వారిని జల్నాలోని ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వారిని ప్రైవేట్ ఆసుపత్రికి మార్చారు. ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగమే కారణమని ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు, అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఎస్పీ ఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు.

# పాలన నా చేతుల్లో లేదు



కోల్‌కతా: మాల్దా జిల్లాలో 'సర్' విధుల్లో ఉన్న ఏడుగురు జ్యుడీషియల్ అధికారులను నిర్బంధించిన విషయం తనకు తెలియదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలిపారు. ఈ నెలలో బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఈ క్రమంలో అధికారులను నిర్బంధించడం ఆ రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతోంది. సాగర్‌దిఘిలో జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ, అధికారుల నిర్బంధం తనకు తెలియదని, ప్రస్తుతం పాలన తన చేతుల్లో లేదని స్పష్టం చేశారు. అధికారుల నిర్బంధానికి బాధ్యులు ఎవరో తనకు తెలియదని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయమై తనకు ఎవరూ సమాచారం కూడా ఇవ్వలేదని చెప్పారు. పరిపాలన తన చేతుల్లో లేదని, శాంతిభద్రతలను ఎన్నికల సంఘం నియంత్రిస్తోందని తెలిపారు. వారంతా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట వింటున్నారని అన్నారు. అధికారులను కూడా కేంద్రం మార్చిందని ఆరోపించారు. తన అధికారాలన్నీ ఈసీ చేతిలోకి వెళ్లాయని అన్నారు. ఓటర్ల జాబితా సమగ్ర సర్వే (ఎస్ఐఆర్)పై ప్రజలు చాలా కోపంగా ఉన్నారని మమతా బెనర్జీ అన్నారు. మాల్దాలో జరిగిన అధికారుల నిర్బంధం ఘటన బీజేపీ కుట్రలో భాగమని ఆమె ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికను రద్దు చేయించి, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని బీజేపీ భావిస్తోందని అన్నారు. న్యాయాధికారులకు రక్షణ కల్పించడంలో ఎన్నికల సంఘం విఫలమైందని ఆరోపించారు.



# గెలికితే ఆపరేషన్ సిందూర్ 2.0


## దాయాదికి రాజ్‌నాథ్ హెచ్చరికలు

తిరువనంతపురం: పశ్చిమాసియాలో యుద్ధం నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో, పొరుగు దేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే తీవ్ర చర్యలు ఉంటాయని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. ప్రస్తుత పరిస్థితులను ఆసరాగా చేసుకుని భారత్‌పై అనాలోచిత ఆలోచన చేస్తే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని అన్నారు. కేరళలోని తిరువనంతపురంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించకుండా పరోక్షంగా హెచ్చరించారు. పొరుగుదేశం ఉగ్రవాద చర్యలకు గతంలో దీటుగా బదులిచ్చామని గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కవ్వింపు చర్యలకు పాల్పడితే ఊహించనిరీతిలో భారత్ స్పందిస్తుందని అన్నారు. ఆపరేషన్ సింధూర్ ఇంకా ముగియలేదని కూడా ఆసక్తికర వ్యాఖ్య చేశారు. యూరి దాడి తర్వాత జరిపిన సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా తర్వాత వైమానిక దాడులు, పహల్గామ్ దాడుల అనంతరం ఆపరేషన్ సిందూర్.. ఇలా ఉగ్రవాద చర్యలపై భారత్ ఎప్పటికప్పుడు తీవ్రంగా స్పందించిందని తెలిపారు. గత ఏడాది ఏప్రిల్ నెలలో పహల్గామ్ ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ దాడి జరిగి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

# భారత్.. మాతో చేయి కలుపు: యూకే

లండన్: ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో ఇరాన్ మూసివేసిన హర్మూజ్ జలసంధి సంక్షోభం అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచ ఇంధన రవాణాలో కీలకమైన ఈ మార్గాన్ని తిరిగి తెరిపించేందుకు యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) నడుం బిగించింది. ఇందులో భాగంగా 35 దేశాలతో నిర్వహిస్తున్న అత్యవసర సమావేశానికి భారత్‌ను కూడా ఆహ్వానించింది.

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం ఉదయం భారీ నష్టాల్లో ప్రారంభమై, చివరకు లాభాల్లో ముగిశాయి. 1500 పాయింట్లకు పైగా నష్టం నుంచి సెన్సెక్స్ కోలుకోవడం గమనార్హం. సెన్సెక్స్ ఉదయం 72,262 పాయింట్ల వద్ద భారీ నష్టాల్లో ప్రారంభమైంది. బుధవారం నాటి ముగింపుతో (73,134) 900 పాయింట్లకు పైగా నష్టంతో ప్రారంభమైంది. మధ్యాహ్నం వరకు నష్టాల్లో కొనసాగిన సూచీలు, ఆ తర్వాత లాభాల్లోకి వచ్చాయి. డాలరు మారకంతో రూపాయి మారకం విలువ బలోపేతం కావడం, అన్ని రంగాల్లో ఎంపిక చేసిన స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కారణంగా సూచీలు రాణించాయి. సూచీలు 185 పాయింట్లు లాభపడి 73,319 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 33.70 పాయింట్ల లాభంతో 22,713 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 157 పైసలు కోలుకుని 93.13గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు స్టాక్స్ లాభాల్లో ముగిశాయి. ఏషియన్ పేయింట్స్, ఎటర్నల్, సన్ ఫార్మా, ఎన్టీపీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి.

# భారత నౌకలకు ఢోకా లేదు

## హర్మూజ్ జలసంధిపై ఇరాన్ కీలక ప్రకటన

టెహ్రాన్: ఇజ్రాయెల్, అమెరికాతో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో కీలకమైన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలపై ఆంక్షలు విధించిన ఇరాన్.. భారత్‌కు కీలక హామీ ఇచ్చింది. "భారత మిత్రులకు ఎలాంటి ఆందోళన అవసరం లేదు. వారు సురక్షితంగా ఉన్నారు" అని భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం గురువారం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రకటించింది. ఈ భరోసాతో భారత్ కాస్త ఊపిరి పీల్చుకుంది. ప్రపంచంలోని 20 శాతం ఇంధన రవాణా జరిగే హర్మూజ్ జలసంధి ఇరాన్ నియంత్రణలో ఉంది. ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్, అమెరికాతో వివాదం మొదలైనప్పటి నుంచి ఇరాన్ ఈ మార్గంలో రాకపోకలను దాదాపు నిలిపివేసింది. అయితే భారత్, చైనా, రష్యా, ఇరాక్, పాకిస్థాన్ వంటి స్నేహపూర్వక దేశాల నౌకలను మాత్రమే అనుమతిస్తున్నట్లు ఇరాన్ స్పష్టం చేసింది. ఈ దిగ్బంధనం వల్ల భారత్ సహా పలు దేశాలకు ఇంధన సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇప్పటికే 8 భారత నౌకలు హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటాయి. వీటి ద్వారా సుమారు 94,000 టన్నుల ఎల్‌పీజీ భారత్‌కు చేరింది. అయితే, భారత్‌కు రావాల్సిన ఎల్‌పీజీ, ముడిచమురు, ఎల్ఎన్‌జీతో కూడిన మరో 19 నౌకలు ఇంకా అక్కడే చిక్కుకుపోయాయని అధికారులు తెలిపారు. ఇటీవల జరిగిన మంత్రిత్వ శాఖల సమావేశంలో షిప్పింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా ఈ వివరాలు వెల్లడించారు. చిక్కుకున్న నౌకల్లో భారత్‌కు చెందినవి 9 ఉండగా, విదేశీ జెండాలతో భారత్‌కు వస్తున్నవి 10 ఉన్నాయని ఆయన వివరించారు. ఈ సంక్షోభం కారణంగా మొత్తం 500 నౌకలు జలసంధిలో నిలిచిపోయినట్లు సమాచారం.

# ఖర్గే వర్సెస్ రిజిజు

## అఖిలపక్ష భేటీపై రుసరుస

న్యూఢిల్లీ: పార్లమెంట్ వేదికగా అధికార, ప్రతిపక్షాల మధ్య మరోసారి మాటల యుద్ధం జరిగింది. పశ్చిమాసియా సంక్షోభంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి ప్రధాని మోదీ హాజరుకాకపోవడాన్ని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్రంగా ప్రశ్నించారు. దీనిపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు గట్టిగా బదులివ్వడంతో సభలో కాసేపు వేడి రాజుకుంది. "పశ్చిమాసియా ఉద్రిక్తతలపై మీరు అఖిలపక్ష సమావేశం పెట్టారు. ఆ సమావేశానికి ప్రధానమంత్రి ఎందుకు రాలేదు?" అని ఖర్గే ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఇంధన ధరల పెరుగుదల వంటి కీలక అంశాలపై చర్చకు రాకుండా, ప్రభుత్వం తన అజెండాను ప్రతిపక్షాలపై రుద్దుతోందని ఆయన ఆరోపించారు. తాము ప్రతినిధులను పంపినా ప్రధాని రాలేదని, కేవలం ఉపన్యాసాలు వినడానికి తాము రావాలా అని నిలదీశారు. ఖర్గే వ్యాఖ్యలపై కిరణ్ రిజిజు ఘాటుగా స్పందించారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ప్రతిపక్షాలు రాజకీయం చేయడం దురదృష్టకరమని అన్నారు. అదే అఖిలపక్ష సమావేశానికి లోక్‌సభ, రాజ్యసభలోని ప్రతిపక్ష నేతలు ఎందుకు హాజరు కాలేదని ఆయన ఎదురు ప్రశ్నించారు. ప్రభుత్వం ఏ చర్చ నుంచీ వెనక్కి తగ్గడం లేదని, ఇప్పటికే ఈ అంశంపై ప్రధాని, మంత్రులు ఉభయ సభల్లో ప్రకటనలు చేశారని గుర్తుచేశారు. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతున్నాయి. దీని ప్రభావంతో దేశంలో గ్యాస్, పెట్రోల్ ధరలు పెరగొచ్చని విపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే వ్యూహరచన కోసం ప్రభుత్వం సర్వపక్ష భేటీని ఏర్పాటు చేసింది. అయితే ఈ సమావేశానికి ప్రధాని గైర్హాజరు కావడం రాజకీయ దుమారానికి కారణమైంది.

ఈవార్తలు
# వినోదవాణి
CINEMA
శుక్రవారం 3-4-2026, జగిత్యాల
www.evarthalu.com


లవ్లీ చిత్రం


అదితి బుధతోకి



## రైతు భూమి సోనాలీ బింద్రే కబ్జా

సోనాలీ బింద్రే, ఆమె భర్త గోల్డి బెహల్ లు తన వ్యవసాయ భూమిని కబ్జా చేశారు అంటూ ఏకంగా పోలీసులను ఆశ్రయించాడు ఒక రైతు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. పూణే కు చెందిన చంద్రకాంత్ అనే రైతు గత కొంత కాలంగా తన 30 గుంటల భూమి కోసం పోరాటం చేస్తున్నాడు. పలు సార్లు సోనాలీ బింద్రేను, ఆమె భర్తను కలిసేందుకు గాను ప్రయత్నాలు చేశాడు. అయినా కూడా ఫలితం లేకుండా పోయింది. తన భూమిని ఆక్రమించారు అంటూ స్థానికంగా ఉన్న పెద్ద వారి వద్ద మొరపెట్టుకున్న కూడా ఫలితం లేకుండా పోయిందట. అందుకే సదరు రైతు పోలీసులను ఆశ్రయించాడు. తనకు 1957 నుంచి వంశపారంపర్యంగా వస్తున్న భూమిని సోనాలీ బింద్రే ఆమె భర్త కబ్జా చేశారంటూ ఫిర్యాదు చేశాడు. తనను బెదిరించి ఆ భూమిని ఆక్రమించుకుని, ఆ భూమిలోకి కనీసం తనను అడుగు పెట్టకుండా చూస్తున్నారంటూ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో చంద్రకాంత్ ఆరోపించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేయనున్నట్లుగా చెప్పారు. రెవెన్యూ అధికారులతో ఈ విషయమై పోలీసులు చర్చించే అవకాశాలు ఉన్నాయి. అయితే, రైతు ఆరోపణలపై సోనాలీ బింద్రే స్పందించింది. తాను కొన్న ఏ భూమిని అయినా చట్టబద్దంగా కొన్నామని, అందుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు పూర్తి చేశామని చెప్పుకొచ్చింది.



## జబర్దస్త్ ఫేమ్ కొమురక్కపై దాడి

జబర్దస్త్ ఫేమ్ కొమురక్కపై దాడి జరిగింది. అభిమానులమని.. ఫోటో దిగుతామని వచ్చిన ఎనిమిది మంది ఆమెపై దాడికి పాల్పడిన ఉదంతం షాకింగ్ గా మారింది. దాడికి పాల్పడిన వారంతా యుక్త వయస్కులే కావటం గమనార్హం. మరో కీలక అంశం ఏమంటే.. దాడికి స్కెచ్ వేసింది.. దాడి చేసింది ఆమెకు అసిస్టెంట్ గా ఉన్న శ్రీనాథ్ కావటం గమనార్హం. మహబూబ్ నగర్ జిల్లా బాలానగర్ మండలం ఉడిత్యాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. కొమురక్క వద్ద శ్రీనాథ్ అనే యువకుడు సహాయకుడిగా ఉంటున్నాడు. కొద్దికాలం క్రితం కొమురక్క ఇంట్లో బంగారం చోరీ జరిగింది. ఈ విషయంలో శ్రీనాథ్‌ను నిలదీయగా.. తప్పు ఒప్పుకొని తానే చోరీ చేసినట్లు చెప్పాడు. దొంగలించిన బంగారాన్ని తిరిగి ఇచ్చేస్తానని చెప్పాడు. అప్పటి నుంచి ఆ బంగారాన్ని తిరిగి ఇవ్వలేదు. ఎన్నిసార్లు అడిగినా శ్రీనాథ్ చోరీ చేసిన బంగారాన్ని తిరిగి ఇవ్వకపోవటంతో రెండు రోజుల క్రితం కొమురక్క మరోసారి మందలించారు. కొమురక్క గట్టిగా అడగటంతో శ్రీనాథ్ తన సొంతూరు స్నేహితులకు విషయాన్ని చెప్పాడు. తనపై ఒత్తిడి తెస్తున్న నేపథ్యంలో ఆమెపై దాడికి పాల్పడేలా ప్లాన్ చేశాడు. రాత్రి పదకొండు గంటల వేళలో కొమురక్క ఇంటికి వచ్చిన ఎనిమిది మంది.. తాము ఆమె అభిమానులమని.. ఫోటో దిగేందుకు వచ్చామని నమ్మించి, దాడికి ప్రయత్నించారు. వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా.. నిందితులు తమ టూవీలర్ ను వదిలేసి పరారయ్యారు.



## ఆ సలహా వల్లే ఈ స్థాయిలో ఉన్నా

బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన స్థానం సంపాదించుకున్న నటి దివ్యా దత్తా మరోసారి వార్తల్లో నిలిచింది. ప్రస్తుతం ఆమె నటించిన చిరాయా వెబ్ సిరీస్ జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతూ మంచి స్పందన అందుకుంటోంది. ఈ సిరీస్‌తో ఆమె తన నటన ప్రయాణాన్ని కొత్త కోణంలో మళ్లీ నిర్వచించుకుంటూ, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో కూడా తన ప్రత్యేకతను చాటుతున్నారు. వీర్ జారా తర్వాత దివ్య దత్తాకు భారీ అవకాశాలు క్యూ కట్టగా వాటిలో ఏకంగా 20 సినిమాలకు సైన్ చేసిన దివ్య.. ఆ అవకాశాలను ఎలా ఉపయోగించుకోవాలన్న దానిపై సందిగ్ధంలో పడినట్టు ఆమె తెలిపారు.

## తెలుగు అబ్బాయిలు మంచోళ్లు: మానస శర్మ



సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించిన 'రాకాస' సినిమా ఏప్రిల్ 3న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రమోషన్స్‌లో దర్శకురాలు మానస శర్మ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయ్యాయి. తెలుగు అబ్బాయిల గురించి ఆమె పాజిటివ్‌గా స్పందించిన తీరు అందరినీ ఆకట్టుకుంటోంది. ప్రమోషన్స్‌లో విలేకరులు అడిగిన ప్రశ్నలకు మానస శర్మ చాలా కూల్‌గా సమాధానమిచ్చారు. వెబ్ సిరీస్ ప్రపంచం నుండి వెండితెరకు దర్శకురాలిగా పరిచయం అవుతున్న ఆమెను అందరూ ప్రశంసిస్తుంటే ఎలా అనిపిస్తుందని అడగ్గా.. 'తెలుగు అబ్బాయిలు చాలా మంచోళ్లు.. అమ్మాయిలు ఏం చేసినా బాగా ఎంకరేజ్ చేస్తున్నారు' అంటూ వారిపై ప్రశంసలు కురిపించారు.

## కాక పుట్టించేలా మోనాసింగ్

బాలీవుడ్ నటి మోనా సింగ్ తాజా వెబ్ సిరీస్ మా కా సమ్ తో మరోసారి డిజిటల్ తెరపై సంచలనం సృష్టించడానికి సిద్ధమవుతోంది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో రిలీజ్ అవుతోన్న ఈ సిరీస్ ఒక విభిన్నమైన కాకపుట్టించే కథాంశంతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. జస్సీ జైసీ కోయి నహిన్ కాలం నుండి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మోనా సింగ్ ఇందులో సవాలుతో కూడిన పాత్రను పోషిస్తోంది. ఈ సిరీస్ ప్రధానంగా ఒంటరి తల్లి చుట్టూ తిరుగుతుంది. పిల్లల పెంపకంలో మునిగిపోయిన ఒక తల్లి, తన వ్యక్తిగత జీవితాన్ని, ముఖ్యంగా తనలోని స్త్రీ హృదయాన్ని మళ్ళీ ఎలా ఆవిష్కరించుకుంది అనేదే కథాంశం. సమాజం విధించిన కట్టుబాట్లను పక్కన పెట్టి ఒక తోడు కోసం లేదా ప్రేమ కోసం ఆమె చేసే అన్వేషణ ఇందులో హైలైట్‌గా నిలవబోతోంది. తల్లులకు కూడా సొంత కోరికలు, ఇష్టాయిష్టాలు ఉంటాయని ఈ సిరీస్ బలంగా చాటి చెబుతోంది. తాజాగా ఈ ప్రాజెక్ట్ గురించి మోనా సింగ్ మాట్లాడుతూ, సమాజంలో తల్లుల పట్ల ఉన్న పాతకాలపు ఆలోచనలను ఈ సిరీస్ ప్రశ్నిస్తుందని ధీమా వ్యక్తం చేసింది.



## షూటింగ్ గ్యాప్‌లో జిమ్, యోగా

షూటింగ్ సెట్స్‌లో ఎక్కువగా ఉండే వెయిటింగ్ టైమ్ ను ఎలా సద్వినియోగం చేసుకోవచ్చో బాలీవుడ్ నటి ట్వింకిల్ ఖన్నా తన అనుభవంతో వివరించారు. సాధారణంగా చాలామంది ఈ సమయాన్ని బోర్‌గా ఫీలవుతూ గడిపేస్తుంటే, తాను మాత్రం దాన్ని యాక్టివ్‌గా మార్చుకుంటానని ట్వింకిల్ చెబుతున్నారు. తన మాటల్లో చెప్పాలంటే, షూటింగ్ ప్రారంభం కావడానికి ఇంకా సమయం ఉన్నప్పుడు మెట్లను జిమ్‌లా ఉపయోగించి చిన్న చిన్న వ్యాయామాలు చేస్తానని తెలిపారు. ఇది శరీరాన్ని చురుకుగా ఉంచడమే కాకుండా, మూడ్‌ను కూడా ఫ్రెష్‌గా మార్చుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా, కాసేపు యోగా చేయడం, మరీ ప్రత్యేకంగా భ్రమరి ప్రాణాయామం చేయడం ద్వారా మైండ్‌ను రిలాక్స్‌లో ఉంచుతానని వెల్లడించారు.



## బాధపడుతూ కూర్చోను

తమిళ చిత్రం డ్రాగన్ తో పాపులర్ అయిన కయాదు లోహార్ తెలుగులోనూ అవకాశాలు అందుకుంటోన్న సంగతి తెలిసిందే. ఇటీవలే రిలీజ్ అయిన ఫంకీలోనూ విశ్వక్ సేన్ కు జోడీగా నటించింది. అయితే ఈ సినిమా ఆశించిన ఫలితాన్ని సాధించలేదు. ప్రస్తుతం నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తోన్న ది ప్యారడైజ్ లో నటిస్తోంది. ఇవిగాక తమిళ, మలయాళ సినిమాలోనూ బిజీగా ఉంది. తాజాగా ఈ బ్యూటీ నటించిన ఓ మలయాళ చిత్రం తెలుగులో రిలీజ్ అవుతుంది. ఈ సినిమా ప్రచారంలో భాగంగా అమ్మడు తెలుగు సినిమాలపై సెటైర్ వేసింది. తెలుగులో ఆమె నటించిన చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను అందుకోకపోవడంతో అమ్మడు తనదైన శైలిలో స్పందించింది. ఒక రకంగా సెటైరికల్‌గా అనిపించేలా ఆమె చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చకు తీస్తున్నాయి. తాను నటించిన సినిమాలు పరాజయం పాలవ్వడం గురించి తనకు ఎటువంటి విచారం లేదన్నట్లు వ్యాఖన్యా నించింది. సినిమా రిజల్ట్ అనేది మన చేతుల్లో ఉండదు. నేను నా వంతు ప్రయత్నం చేశాను. కానీ అవి ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయాయి అని పేర్కొంది. అంతటితో ఆగకుండా ఆ సినిమాల వైఫల్యాల గురించి కూర్చుని బాధపడేంత తీరిక కూడా తనకు లేదని అనడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రస్తుతం తాను తెలుగు తో పాటు ఇతర భాషా చిత్రాలతో ఎంతో బిజీగా ఉన్నానంది. చేతినిండా ప్రాజెక్టులు ఉన్నప్పుడు పాత సినిమాల గురించి ఆలోచించడం సమయం వృధా అన్నట్లు అభిప్రాయపడింది. మలయాళం , ఇతర పరిశ్రమల్లో తనకు మంచి గుర్తింపు లభిస్తోందని అక్కడ వరుస అవకాశాలు వస్తున్నాయని చెప్పుకొచ్చింది.







# సన్ రైజర్స్

## కోల్‌కతాపై ఘన విజయం.. హైదరాబాద్‌ఆల్‌రౌండ్ షో

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అదిరిపోయే బోణీ కొట్టింది. తొలి మ్యాచ్ లో ఆర్సీబీ చేతిలో ఓడిన హైదరాబాద్ జట్టు నేడు స్ఫూర్తిదాయక ప్రదర్శన కనబర్చింది. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో పోరులో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో 65 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ నిర్దేశించిన 227 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో కోల్‌కతా 16 ఓవర్లలో 161 పరుగులకే కుప్పకూలింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 226 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (21 బంతుల్లో 46), అభిషేక్ శర్మ (21 బంతుల్లో 48) ఆకాశమే హద్దుగా చెలరేగి పవర్‌ప్లేలోనే స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. అనంతరం హెన్రిచ్ క్లాసెన్ (35 బంతుల్లో 52) హాఫ్ సెంచరీతో రాణించగా, తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి (24 బంతుల్లో 39) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కోల్‌కతా బౌలర్లలో బ్లెస్సింగ్ ముజరబానీ 4 వికెట్లు పడగొట్టాడు. భారీ లక్ష్య ఛేదనలో కోల్‌కతా తడబడింది. ఓపెనర్ ఫిన్ అలెన్ (7 బంతుల్లో 28) మెరుపు ఆరంభం ఇచ్చినా, అది ఎక్కువసేపు నిలవలేదు. అంగ్‌క్రిష్ రఘువంశీ (29 బంతుల్లో 52) అర్ధశతకంతో ఒంటరి పోరాటం చేశాడు. రింకూ సింగ్ (35) అతనికి కొంత సహకారం అందించినా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. దీంతో కోల్‌కతా 16 ఓవర్లలోనే 161 పరుగులకు ఆలౌట్ అయింది. సన్‌రైజర్స్ బౌలర్లలో జయదేవ్ ఉనద్కత్ 3 వికెట్లతో కోల్‌కతా పతనాన్ని శాసించాడు. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి, ఎషాన్ మలింగ చెరో రెండు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. సన్ రైజర్స్ తన తదుపరి మ్యాచ్ ను ఏప్రిల్ 5న లక్నో సూపర్ జెయింట్స్ తో ఆడనుంది. ఈ మ్యాచ్ హైదరాబాద్ లో జరగనుంది.



# తొలి బంతి.. గుండెల్లో దడదడ

### 15 ఏళ్లయినా ఆ రాత్రిని మర్చిపోలేం


### 2011 ప్రపంచకప్ ఫైనల్‌పై సచిన్ పోస్ట్

భారత క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించిన 2011 ప్రపంచకప్ విజయాన్ని సాధించి నేటికి 15 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ఆనాటి మధుర స్మృతులను గుర్తుచేసుకున్నాడు. ఆ ఫైనల్ మ్యాచ్‌లోని ఉత్కంఠను, విజయం తర్వాత కలిగిన ఆనందాన్ని పంచుకుంటూ సోషల్ మీడియాలో ఓ భావోద్వేగ పోస్ట్ పెట్టాడు. “మొదటి బంతి ఎప్పుడూ గుండె వేగాన్ని పెంచుతుంది. కానీ ఆ రాత్రి, ఆ వేగం అస్సలు తగ్గలేదు. 15 ఏళ్ల తర్వాత కూడా ఆ జ్ఞాపకాలు మాతోనే ఉన్నాయి. భారత్ కోసం ప్రపంచకప్ గెలవాలనే ఒకే ఒక్క కలతో మేమంతా పెరిగాం. ఈ ప్రయాణంలో భాగమైన ప్రతీ ఒక్కరికీ, అభిమానులందరికీ ధన్యవాదాలు” అంటూ సచిన్ తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. తన కెరీర్‌లో చివరి ప్రపంచకప్‌ను సొంత గడ్డపై గెలవడం సచిన్‌కు మరపురాని అనుభూతిని మిగిల్చింది. 2011 ఏప్రిల్ 2న ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో భారత్, శ్రీలంక జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక, మహేల జయవర్ధనే అద్భుతమైన సెంచరీతో (103 నాటౌట్) రాణించడంతో నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 274 పరుగుల భారీ స్కోరు సాధించింది. 275 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన గౌతమ్ గంభీర్, బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. కేవలం 3 పరుగుల తేడాతో సెంచరీ చేజార్చుకున్నప్పటికీ, 97 పరుగులతో విజయానికి బలమైన పునాది వేశాడు. అనంతరం కెప్టెన్ ఎంఎస్ ధోనీ క్రీజులో నిలబడి మ్యాచ్‌ను తన చేతుల్లోకి తీసుకున్నాడు. యువరాజ్ సింగ్‌తో (21 నాటౌట్) కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన ధోనీ, కేవలం 79 బంతుల్లో 91 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. చివరిలో సిక్సర్ బాది భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. ఈ గెలుపుతో 28 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. 1983 తర్వాత భారత్ రెండోసారి వన్డే ప్రపంచకప్‌ను ముద్దాడి, దేశవ్యాప్తంగా సంబరాల్లో మునిగిపోయింది.

# పంత్‌తో గోయెంకా లొల్లి!

### మరోసారి రిపీటైన కేఎల్ ఎపిసోడ్

ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) 6 వికెట్ల తేడాతో ఘోర పరాజయం పాలైంది. మ్యాచ్ ముగిసిన తర్వాత లక్నో జట్టు యజమాని సంజీవ్ గోయెంకా మైదానంలోనే కెప్టెన్ రిషభ్ పంత్, హెడ్ కోచ్ జస్టిన్ లాంగర్‌తో తీవ్రంగా చర్చిస్తున్న దృశ్యాలు కెమెరాలకు చిక్కాయి. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో గోయెంకా ప్రవర్తనపై మరోసారి చర్చ మొదలైంది. గతంలో 2024 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఓటమి అనంతరం అప్పటి కెప్టెన్ కేఎల్ రాహుల్‌తో గోయెంకా ఇలాగే బహిరంగంగా అసహనం వ్యక్తం చేసిన సంఘటనను నెటిజన్లు గుర్తుచేసుకుంటున్నారు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ కేవలం 141 పరుగులకే కుప్పకూలి నిరాశపరిచింది. అనంతరం 142 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్.. సమీర్ రిజ్వీ, ట్రిస్టన్ స్టబ్స్ రాణించడంతో మరో రెండు ఓవర్లు మిగిలి ఉండగానే సునాయాసంగా విజయం సాధించింది. ఓటమి అనంతరం రిషభ్ పంత్ మాట్లాడుతూ... బ్యాటింగ్ వైఫల్యమే ఓటమికి ప్రధాన కారణమని అంగీకరించాడు. “కొత్త బంతితో పిచ్ బౌలర్లకు సహకరించింది, కానీ మేము భాగస్వామ్యాలు నిర్మించడంలో విఫలమయ్యాం. 140 పరుగుల వంటి తక్కువ స్కోరు చేసినప్పుడు, బౌలర్లు ఒత్తిడికి గురవడం సహజం. పవర్‌ప్లేలో మరికొన్ని వికెట్లు తీసి ఉంటే ఫలితం వేరేలా ఉండేదేమో. తక్కువ పరుగులు ఉన్నప్పుడు, బ్యాటర్లతో బౌలింగ్ చేయించడం వంటి కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది” అని పంత్ అన్నాడు. లక్నో బౌలర్లు ఆరంభంలో ఢిల్లీని ఒత్తిడిలోకి నెట్టే



ప్రయత్నం చేశారు. ముఖ్యంగా పేసర్ ప్రిన్స్ యాదవ్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. అతను పతుమ్ నిస్సంకను అవుట్ చేయడమే కాకుండా, అక్షర్ పటేల్‌ను ఒక అద్భుతమైన బంతితో క్లీన్ బౌల్డ్ చేశాడు. అయితే, స్వల్ప లక్ష్యం కావడంతో ఢిల్లీ బ్యాటర్లు ఒత్తిడిని అధిగమించి జట్టును విజయతీరాలకు చేర్చారు. తన వికెట్ గురించి అడిగినప్పుడు, “దాని గురించి ఆలోచించకపోవడమే మంచిది. కొన్ని విషయాలు మన నియంత్రణలో ఉండవు. వాటి గురించి ఎక్కువగా ఆలోచిస్తే వెనుకబడిపోతాం” అని పంత్ వ్యాఖ్యానించాడు.

### క్లారిటీ ఇచ్చిన లక్నో ఓనర్

ఓటమిపై జట్టు యజమాని సంజీవ్ గోయెంకా సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఓటమి అనంతరం కెప్టెన్ రిషభ్ పంత్, హెడ్ కోచ్ జస్టిన్ లాంగర్‌తో ఆయన మైదానంలో తీవ్రంగా చర్చిస్తున్న వీడియోలు, ఫొటోలు వైరల్ అయిన నేపథ్యంలో ఆయన చేసిన పోస్ట్ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో జట్టు కేవలం 141 పరుగులకే కుప్పకూలింది. అనంతరం లక్ష్య ఛేదనలో ట్రిస్టన్ స్టబ్స్, సమీర్ రిజ్వీ రాణించడంతో ఢిల్లీ క్యాపిటల్స్ మరో రెండు ఓవర్లు మిగిలి ఉండగానే సునాయాసంగా విజయం సాధించింది. మ్యాచ్ ముగిసిన తర్వాత మైదానంలో కెప్టెన్ పంత్‌తో గోయెంకా ఏదో సీరియస్‌గా చర్చిస్తున్న దృశ్యాలు కెమెరాలకు చిక్కాయి. దీంతో జట్టులో ఏదో జరుగుతోందంటూ ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో గోయెంకా ‘ఎక్స్’ వేదికగా స్పందిస్తూ అన్నింటికీ తెరదించారు. ‘ఇది చాలా సుదీర్ఘమైన సీజన్. అర్థవంతమైన దాన్ని నిర్మించే క్రమంలో ఇలాంటి క్షణాలు సహజం. మా కెప్టెన్, జట్టు బలం పుంజుకోగలరని నాకు పూర్తి విశ్వాసం ఉంది. ఈరోజు మద్దతుగా నిలిచిన మా అభిమానులకు ధన్యవాదాలు. మేం మరింత బలంగా తిరిగి వస్తాం. ఈ సీజన్‌లో లక్నో ప్రస్థానం ఇంకా ముగిసిపోలేదు’ అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ పోస్ట్‌తో ఆయన జట్టుకు, కెప్టెన్‌కు పూర్తి మద్దతు ప్రకటించారు.

# మహ్మద్ షమీ సరికొత్త రికార్డు

లక్నో సూపర్ జెయింట్స్ స్టార్ పేసర్ మహ్మద్ షమీ ఐపీఎల్ చరిత్రలో ఎవరికీ సాధ్యం కాని అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. అయితే, షమీ ఈ చారిత్రక ఘనత సాధించిన మ్యాచ్‌లో అతని జట్టు లక్నో ఓటమి పాలైంది. బుధవారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన సీజన్ తొలి మ్యాచ్‌లో లక్నో 6 వికెట్ల తేడాతో ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో లక్నో నిర్దేశించిన 142 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్‌ను షమీ ప్రారంభించాడు. తొలి బంతికే ఢిల్లీ ఓపెనర్ కేఎల్ రాహుల్‌ను ఔట్ చేసి జట్టుకు శుభారంభం అందించాడు. ఐపీఎల్ 18 ఏళ్ల చరిత్రలో ఒక ఇన్నింగ్స్‌లో తొలి బంతికే వికెట్ తీయడం షమీకి ఇది ఐదోసారి. ఈ ఘనత సాధించిన తొలి, ఏకైక బౌలర్‌గా షమీ నిలిచాడు. ఈ జాబితాలో షమీ తర్వాత ఏడుగురు బౌలర్లు తలో మూడుసార్లతో రెండో స్థానంలో ఉన్నారు. వారిలో ప్రవీణ్ కుమార్, ఉమేశ్ యాదవ్, ట్రెంట్ బౌల్ట్, లసిత్ మలింగ, భువనేశ్వర్ కుమార్, అశోక్ దిండా, ప్యాట్ కమ్మిన్స్ ఉన్నారు. అయితే, షమీ అద్భుత ఆరంభాన్ని లక్నో సద్వినియోగం చేసుకోలేకపోయింది. ‘ఇంపాక్ట్ ప్లేయర్’గా వచ్చిన సమీర్ రిజ్వీ అద్భుతంగా రాణించడంతో ఢిల్లీ క్యాపిటల్స్ సునాయాసంగా విజయం సాధించింది.



# ధోనీ, కపిల్‌కు యువీ క్షమాపణలు

భారత క్రికెట్ మాజీ ఆల్-రౌండర్ యువరాజ్ సింగ్, టీమిండియా మాజీ కెప్టెన్లు ఎంఎస్ ధోనీ, కపిల్ దేవ్‌లకు క్షమాపణలు చెప్పాడు. తన తండ్రి, మాజీ క్రికెటర్ యోగ్‌రాజ్ సింగ్ గతంలో వారిపై చేసిన తీవ్రమైన, వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో యువీ ఈ విధంగా స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది. సచిన్ టెండూల్కర్, వీరేంద్ర సెహ్వాగ్, ఎంఎస్ ధోనీ వంటి దిగ్గజాలున్న జట్టులో యువరాజ్ కీలక ఆటగాడిగా వెలుగొందాడు. ముఖ్యంగా 2007 టీ20, 2011 వన్డే ప్రపంచకప్‌ల విజయాల్లో అతని పాత్ర మరువలేనిది. ఓ స్పోర్ట్స్ టాక్ పాడ్‌కాస్ట్‌కు సంబంధించిన టీజర్‌లో యువరాజ్ ఈ వ్యాఖ్యలు చేశాడు. ‘నేను కపిల్ దేవ్, ఎంఎస్ ధోనీకి క్షమాపణ చెప్పాలనుకుంటున్నా’ అని అందులో పేర్కొన్నాడు. తన తండ్రి ఇచ్చే ఇంటర్వ్యూల గురించి ప్రస్తావించినప్పుడు, ‘నాన్నా, అది కరెక్ట్ కాదు అని చెప్పాను’ అంటూ యువరాజ్ తెలిపాడు. యువరాజ్ సింగ్‌కు భారత జట్టు కెప్టెన్సీ దక్కకపోవడానికి ధోనీనే కారణమంటూ యోగ్‌రాజ్ సింగ్ చాలా కాలంగా ఆరోపణలు చేస్తూ వస్తున్నాడు. ధోనీ వల్లే తన కుమారుడి కెరీర్ దెబ్బతిన్నదని పలు సందర్భాల్లో బహిరంగంగా విమర్శించాడు. ధోనీ నాయకత్వంలోనే యువరాజ్ తన కెరీర్‌లో అత్యధిక కాలం ఆడినప్పటికీ, యోగ్‌రాజ్ మాత్రం ధోనీపై తీవ్రమైన వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నాడు. కేవలం ధోనీపైనే కాకుండా దిగ్గజ ఆల్-రౌండర్ కపిల్ దేవ్‌పైనా యోగ్‌రాజ్ సింగ్ గతంలో సంచలన వ్యాఖ్యలు చేశాడు. 1980లలో తనను జట్టు నుంచి అకారణంగా తొలగించినందుకు కపిల్ దేవ్‌ను చంపాలనుకున్నానని 2025లో యోగ్‌రాజ్ ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు. పిస్టల్ తీసుకుని కపిల్ ఇంటికి వెళ్లానని, కానీ అక్కడ కపిల్ తల్లి ఉండటంతో వెనక్కి వచ్చానని ఆయన చెప్పడం అప్పట్లో పెను ప్రకంపనలు సృష్టించింది. ధోనీ, కపిల్ వంటి ఆటగాళ్లు ఇతరులను చెత్తలా చూశారని కూడా ఆయన ఆరోపించాడు. ఇలాంటి తీవ్రమైన వ్యాఖ్యలతో తరచూ వార్తల్లో నిలిచే తన తండ్రి తీరుపై యువరాజ్ ఇప్పుడు బహిరంగంగా క్షమాపణలు చెప్పడం చర్చనీయాంశంగా మారింది.

# ఐపీఎల్ విలువ మరింత పెరుగుతుంది

ఐపీఎల్ మీడియా హక్కుల విలువ రాబోయే సీజన్లలో తగ్గుతుందంటూ వస్తున్న ఆందోళనలను టోర్నీ ఛైర్మన్ అరుణ్ ధూమల్ కొట్టిపారేశారు. విలువ తగ్గకపోగా, మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం 2023-27 సైకిల్ చివరి దశకు చేరుకుంటున్న తరుణంలో ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రస్తుత సైకిల్‌లో దేశీయ టెలివిజన్ హక్కులను డిస్నీ స్టార్ 3.02 బిలియన్ డాలర్లకు, స్ట్రీమింగ్ హక్కులను వయాకామ్18 3.05 బిలియన్ డాలర్లకు దక్కించుకున్నాయి. ధూమల్ మాట్లాడుతూ.. “మీడియా రంగంలో చాలా విలీనాలు జరిగాయి. కానీ ఐపీఎల్ విషయానికి వస్తే, ఏ మీడియా సంస్థకైనా ఇంత ఆసక్తిని కలిగించే మరో క్రీడా ఈవెంట్ లేదు. ఇది అద్భుతమైన లైవ్ స్పోర్ట్స్ కంటెంట్. ఇక్కడ ప్రతి బంతీ ఒక ఈవెంట్ లాంటిది” అని వివరించారు. “తదుపరి మీడియా హక్కుల సైకిల్ నాటికి, ప్రస్తుత కంపెనీలతో పాటు కొత్త సంస్థల నుంచి కూడా తీవ్రమైన ఆసక్తి ఉంటుంది. కాబట్టి విలువ



తగ్గడానికి నాకు ఎలాంటి కారణాలు కనిపించడం లేదు. టోర్నీ అభివృద్ధి చెందిన తీరు, అది సృష్టించిన విలువ కారణంగా తదుపరి సైకిల్‌లో హక్కుల విలువ మరింత పెరుగుతుందని నేను భావిస్తున్నాను” అని ధూమల్ అన్నారు. సబ్‌స్క్రిప్షన్ ఆధారిత మోడల్‌కు మారినా ఐపీఎల్‌కు డిమాండ్ తగ్గదని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. “నాణ్యమైన కంటెంట్ కోసం డబ్బు చెల్లించడానికి ప్రజలు వెనుకాడరు. ఒక సినిమా కోసం వందల రూపాయలు ఖర్చు చేయడంతో పోలిస్తే, ఒక లైవ్ గేమ్ కోసం రూ. 5, 10 లేదా 25 ఖర్చు చేయడానికి ఎవరు ఆలోచిస్తారు? లైవ్ గేమ్‌లో చివరి బంతి వరకు ఏం జరుగుతుందో తెలియదు” అని ఆయన తెలిపారు. ఫ్రాంచైజీలన్నీ లాభాల్లోనే ఉన్నాయని, ఐపీఎల్ కేవలం క్రికెట్ టోర్నమెంట్ మాత్రమే కాదని, అదొక బలమైన వ్యాపార నమూనా అని ఆయన స్పష్టం చేశారు.

ఈవార్తలు
# ప్రజావాణి
శుక్రవారం 3-4-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

## అమరావతికి అండ.. తెలంగాణకు 'గుండు'!

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన జరిగి పదేళ్లు దాటినా, రెండు రాష్ట్రాల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిలో స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తోంది. అమరావతిని ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా గుర్తించడమే కాకుండా, దానికి పార్లమెంటు సాక్షిగా చట్టబద్ధత కల్పించడం స్వాగతించదగ్గ పరిణామమే. కానీ, అదే సమయంలో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా, చట్టబద్ధమైన హామీల విషయంలో కేంద్రం చూపుతున్న చిన్నచూపు అత్యంత హేయం. విభజన చట్టంలోని సెక్షన్ 94(3) ప్రకారం వెనుక బడిన జిల్లాలకు నిధులు, బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వంటి కీలక హామీలు నేటికీ కాగితాలకే పరిమి తమయ్యాయి. అమరావతికి వేల కోట్ల రూపాయల ఆర్థిక సాయం, ప్రపంచ బ్యాంకు రుణాలు ఇప్పించడంలో చూపిన చొరవ.. తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో మచ్చుకైనా కనిపించడం లేదు. రాష్ట్రం నుంచి భారీగా పన్నుల రూపంలో ఆదా యం పొందుతున్న కేంద్రం, తిరిగి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడటం లో మొండిచేయి చూపుతోందన్న విమర్శల్లో వాస్తవం లేకపోలేదు. ముఖ్యంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలన్న దశాబ్దాల విన్నపాన్ని కేంద్రం బుట్టదాఖలు చేస్తూనే ఉంది. మరో వైపు పొరుగు రాష్ట్ర ప్రాజెక్టులకు మాత్రం నిధుల వరద పారిస్తోంది. రాజకీయ ప్రయోజనాల కోసం ఒక రాష్ట్రాన్ని నెత్తిన పెట్టుకుని, మరో రాష్ట్ర అభ్యర్థనలను గాలికొ దిలేయడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. అమరావతికి చట్టబద్ధత కల్పించడం ద్వారా ఏపీకి స్థిరత్వం చేకూర డం మంచిదే, కానీ తెలంగాణకు ఇచ్చిన చట్టబద్ధమైన హామీలను అమలు చేయక పోవడం పక్షపాత వైఖరిని స్పష్టం చేస్తోంది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రాజకీయ లెక్కలు పక్కన పెట్టి, తెలుగు రాష్ట్రాల పట్ల సమానత్వంతో వ్యవహరించాలి. తెలంగాణ కు రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు, సంస్థల విషయంలో తాత్సారం వీడితేనే దేశాభివృద్ధి లో కీలక పాత్ర పోషిస్తున్న ఈ రాష్ట్రానికి న్యాయం జరుగుతుంది. లేదంటే, ఈ వివక్షా పూరిత ధోరణి భవిష్యత్తులో కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది.

## భూగోళం రూపెత్తుకోవాలి

ఈ ఆకలి కడుపులకు
పిడికెడు మెతుకులు కావాలి
ఈ పేదలకు కొసికింత న్యాయం కావాలి
ఈ బక్క పలుచని బతుకులకు
కాసింత రక్షణ కావాలి
చీకటి గుడిసెలకు చిటికెడు వెన్నెల కావాలి
ఈ దేశంలో చారెడు ఆత్మగౌరవం కావాలి

అహంకారం కూలిపోవాలి
గర్వం పగిలిపోవాలి
స్వార్థం తొలిగిపోవాలి
వీటిని జయించి
వినయం వైపు నడిపించడానికి
పరాభవనామ వచ్చింది!

దేవుని గుళ్ళ చుట్టూ
బ్రహ్మాజెముళ్ల పెత్తనాలు
ప్రవేశ రుసుము
పసిపిల్ల ప్రాణం తీసింది
మనిషికి, మనిషికి మధ్య
ఇనుప తెరలు
వేల ఏళ్ల నుండి కులం పేరుతో
నెత్తురు పారుతుంది
నేటికీ మళ్ళీ అదే దృశ్యం
పాత గాయం మానక ముందే
కొత్త గాయం చిగురిస్తుంది!

సూర్యుడు పడమటి కొండల్లో
అదృశ్యమౌతున్నట్లు
వణికిస్తున్న చలికి
చితి మంటలకు అరచేతులు కాపుకుని
ముఖానికద్దుకున్నట్లు
నీ రాకతో కొంతలో కొంతైనా
మా గొంతులో జీవధార నింపుతావని
ఆశతో ఎదురు చూస్తున్నా!

మాయమై పోతున్న
మనుషులు మధ్య
కాలుతున్న కమురువాసనలు
కన్నీటి లోతుల్లో నివసించే
ఆ మనుషుల ఓదార్పు కోసం
కవి సమూహాల గొంతులతో
వినిపించే
సాహిత్య,సంగీతాల కోసమే
ఈ పరాభవనామ వచ్చింది!

ఓ'పరాభవనామ
నాలుగు తలల
నాగుల బురుజుల్ని
నేల మట్టం చెయ్యాలి
నిన్ను చూసి
భూగోళం రూపెత్తుకోవాలి!!



ఎదిరెపల్లి కాశన్న

## కనువిప్పు కలిగించే వ్యాసావళి




"సమాజం ఎంత అభివృద్ధి చెందిందో కొలవాలంటే ముందు ఆ సమాజంలో మహిళ ఏ స్థానంలో ఉందో చూడాలి" అన్న కార్ల్ మార్క్స్ సిద్ధాంతం ప్రకారం ఇప్పుడు మహిళలు ఎక్కడున్నారో సింహావలోకనం చేసుకోవలసిన అవసరం ఉంది. బందిపోట్లు కవితలో "మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే, మమ్మల్ని విభజించి పాలిస్తోంది" అంటోంది సావిత్రి. ఇలాంటి స్త్రీవాద ధిక్కారమే పురుషాధిపత్య విష కుంభాలను బద్దలు కొడుతుంది. "వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మే రాణి--అయినా, చివరకు వంటింటి గిన్నెలన్నిటిపైనా, మా నాన్న పేరే!" అంటుంది విమల.

ఇందులో లింగ వివక్షను మెండుగా ఎండగట్టింది. ఆధునిక యుగంలోనూ బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో కొడుకు చాటున మహిళల జీవితం గడుస్తున్నదని రచయిత్రి నామని సుజనాదేవి వ్యాసావళిలో వాపోయింది. రవీంద్రుడు "భయంతో ఉన్నవారు ఏదీ సాధించలేరు" అని ఉద్ఘాటించిన అక్షర సత్యాలను అతివలు ఆదర్శంగా తీసుకొని, ఆత్మగౌరవాన్ని పెంపొందిం చుకొని అన్ని రంగాల్లో ముందడుగే యాలనేది సుజనాదేవి ఆకాంక్ష. మన సమాజం ఆడా మగ అంతరాలు లేని సమాజంగా మార్పు చెందాలని ఒక అభ్యుదయ కళాకారుడిగా అభిలాషిస్తున్నాను.



కూకట్ల తిరుపతి
కవి, రచయిత, విమర్శకుడు
కరీంనగర్. 9949247591

పిల్లల చలి తీర్చడానికి అమ్మ నెగడవుతుంది. ఆకలిగొన్నవేళ అన్నమవుతుంది. అలసి సొలసిన వేళ మెత్తని పొత్తిళ్ల పాన్పవుతుంది. సమాజం చూపే వివక్ష, చీత్కారం, ఈసడింపుల బారిన పడకుండా రక్షించే కవచమవుతుంది. కంటనీరొలికే వేళ మెత్తటి కొంగవుతుంది. అనారోగ్యంగా ఉన్న వేళ వెచ్చని పాన్పవుతుంది. సేద తీర్చుటకు కాళ్లతో ఉయ్యాల జంపాలవుతుంది. నిద్ర బుచ్చుటకు వక్ష స్థల శేషతల్పమవుతుంది. తప్పటడుగుల తరుణాన భావి జీవితాన్ని నిలబెట్టే భరోసా అవుతుంది. తీయని పలుకులను నేర్పే తొలి గురువవుతుంది. కడుపు పేగు పాశం పంచిన ఋణానుబంధమవుతుంది. ఊపిరి ఊదినా ఎదుగుదలకు ఊడిగమవుతుంది. కడుపులో తన్నినపుడు నిదురను బలి చేసే కరుణామూర్తవుతుంది. తన జీవితాన్నంతా ధారవోసే త్యాగమయవుతుంది. అట్లాంటి అమ్మ ఎందుకు ఈ రోజున అనాథగా మిగులుతున్నదో? ఆమె అవసానదశలో ఎందుకు అలక్ష్యానికి గురవుతున్నదో? ఈ సృష్టి మనుగడకు కారకురాలు ఎందుకు చిన్నబోతున్నదో? రాగమయి అనురాగమయి ఎందుకు రాగద్వేషాలకు బలౌతున్నదో? తెలుసుకోవడానికి నామని సుజనాదేవి వ్యాసాలు చదువాల్సిందే. మనసుల్లో పేరుకుపోయిన మకిలిని శుభ్రం చేసుకోవాల్సిందే. చైతన్య పూరితం కావాల్సిందే. ఆంగ్ల సాహిత్య ప్రభావ ఫలితంగా ఆధునిక సాహిత్యంలో ఆవిర్భవించిన నూతన ప్రక్రియ వ్యాసం. వ్యాసమంటే విభాగమని అర్థం. ఏ విషయాన్నైనా తీసుకొని, దానిలోని అంశాలను విభజించి వివరించి చెప్పడం. "ఏదేని ఒక అంశంపై విరివిగా రాయడం" - అని శబ్ద రత్నాకరం చెబుతున్నది. 1571లో ఫ్రెంచి రచయిత మాన్ టైన్ రాసిన వ్యాసం ప్రపంచ సాహిత్యంలోనే మొదటిదిగా భావిస్తున్నారు. ఆ తర్వాత ఫ్రాన్సిస్ బేకన్ రాసిన "మై సెల్ఫ్" ను మొదటి వ్యాస సంపుటిగా పేర్కొంటున్నారు. 18వ శతాబ్దంలో ప్రఖ్యాత ఆంగ్ల రచయితలు స్టీల్, ఎడిసన్ వ్యాసాల పరంపరను కొనసాగించారు. స్పెక్టేటర్ వ్యాసాలను అనుసరించి పానుగంటి లక్ష్మీనరసింహారావు సాక్షి వ్యాసాలు రాశాడు. టాట్లర్ వ్యాసాలను అనుకరించి అజ్ఞాత రచయితలు వదులుబోతు వ్యాసాలు రాశారు. 1840-50ల మధ్య సామినేని ముద్దు నరసింహం 'హిత సూచని'లో రాసిన 'ప్రమేయాలు' వ్యాస లక్షణానికి దగ్గరగా ఉన్నాయి. వీటిని పరవస్తు వేంకట రంగాచార్యులు సంగ్రహములని, కందుకూరి వీరేశలింగం పంతులు ఉపన్యాసములని పిలిచారు. వ్యాసం అనే పదాన్ని గురజాడ వెంకట అప్పారావు 1910లో ప్రయోగించాడు. ఆయన "వ్యాస చంద్రిక" అనే పుస్తకాన్ని రచించాడు. "కవికి గీటురాయి గద్యం అయితే; గద్యానికి గీటురాయి వ్యాసం" అని ఆచార్య రామచంద్ర శుక్లా వ్యాసం గొప్పతనాన్ని ప్రస్తుతించారు. వ్యాసంలో ఉపోద్ఘాతం, విషయ వివరణ, ముగింపులు ముఖ్యమైన అంశాలుగా చెప్పవచ్చు. జన జాగృతం కావించడానికి వ్యాస ప్రక్రియను ఎంచుకొని, సమకాలీన సామాజిక రుగ్మతల సాధనకు విస్తృతంగా రాస్తూ, సాహిత్యరంగంలో విశేషంగా రాణిస్తున్న సుజనాదేవి అభినందనీయురాలు.

విజయనగర సామ్రాజ్య సందర్శన సమయంలో నికొలో డా కాంటి తెలుగు భాషను గూర్చి "ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్" అని చేసిన వ్యాఖ్య సి.పి.బ్రౌన్ వంటి ఆంగ్ల అధికారులను బాగా ఆకర్షించింది. తెలుగు భాషను పరిపుష్టం చేయడానికి తోడ్పడింది. "మాతృభాషా మాధ్యమంలో విద్యాబోధన తల్లిపాల వంటిది. మాతృభాషేతర మాధ్యమంలో విద్యాబోధన దాదిపాల వంటిది" అని కొమర్రాజు వేంకట లక్ష్మణరావు సెలవిచ్చారు. "మాతృభాషేతర మాధ్యమ విద్యా బోధన సోపానాలు లేని సౌధం వంటిది" అంటాడు విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్. కానీ రానురాను ఆంగ్ల వ్యామోహం అధికమైంది. నానాటికీ తీసి కట్టు నాగం బొట్లు అన్నట్టు తెలుగు వినియోగం దిగజారుతున్నది. తెలుగుదనం కనుమరుగవుతున్నది. తెలుగు భాష కనుమరుగైతే సంస్కృతి దూరమవుతుంది. భాషను వదులుకోవడం వల్ల సంస్కృతిని విస్మరించడం వల్ల బంధాలు అనుబంధాలు ఆప్యాయతతో కూడిన పిలుపులు దూరమవుతాయి. భాషా సంస్కృతి లేని జాతి క్రమంగా సహజ లక్షణాలను కోల్పోతుంది. తోట గాలి ఏటి నీరు కన్నా స్వచ్ఛమైన తేట తెలుగు భాష తెరమరుగవుతున్నది. ఇంటర్మీడియట్ వరకు తెలుగులో తప్పనిసరి బోధించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులకు తూట్లుపడ్డాయి. మాతృభాష మృతభాషగా మారుతున్న తీరుకు నామని సుజనాదేవి కలవరపడుతూ, తేనెల తేటల మీగడ తరగ తెలుగు మరుగున పడొద్దని రెండు వ్యాసాల్లో ఆందోళన వ్యక్తం చేసింది. ఇవి ఆమె మాతృభాషాభిమానానికి, సహృదయతకు నిదర్శనంగా నిలుస్తాయి.

"మహిళల పట్ల మహిళల శ్రమ పట్ల ప్రత్యేకంగా పెట్టుబడిదారులు ఆకర్షితులు కావడానికి కారణం. చౌకగా లభించడం మాత్రమే కాదు వారు చాలా అణకువగా ఉండడం కూడా" అని క్లారా జెట్కిన్ తేల్చిన విషయం చెప్పారు. పురుషాధిక్య ప్రపంచంలో నిత్యం నిరాటంకంగా మహిళలపై జరుగుతున్న దాడులను గణాంకాలతో సహా సప్రమాణంగా పొందుపరచడానికి రచయిత్రి చాలా అన్వేషించినట్టుగా తెలుస్తున్నది. ఎందరో అణగారిన మహిళల జీవితాలను ఉదహరించారు. 'మహిళా ఉద్యోగి డైరీలో ఒక పేజీ' వ్యాసంలో కుటుంబం కోసం హారతి కర్పూరంలా ఆవిరైపోతున్న అతివల జీవితాన్ని హృద్యంగా చిత్రించింది. కుటుంబ హింసకు కారణాలు-నివారణోపాయాలు వ్యాసంలో ధిక్కార శంఖారావం పూరించింది. ఊరికి వన్నె తెచ్చిన ఉజ్మా బేగం వ్యాసంలో చెక్కుచెదరని చైతన్యంతో శ్రమను సాకారం చేసుకుని, చేతి గాజుల తయారీలో రాణిస్తున్న ఉజ్మా బేగం స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని వడకట్టింది. కష్టాల కడలిని ఈది, వివక్షల కొండలను పిండి చేసి, గమ్యాన్ని ముద్దాడిన మగువల జీవితాలను పేర్కొన్నారు. బతుకమ్మ, దుర్గామాత, నారసింహుడు అత్యంత భక్తి ప్రపత్తులతో కూడిన వ్యాసాలు. సమాజపు చౌకబారుతనాన్ని, సన్నగిల్లుతున్న విద్యా విలువలను 'అంగట్లో అమ్మకానికి డాక్టరేట్లు' వ్యాసం తేటతెల్లం చేసింది. ఎంత ఎదిగిన ఒదిగి ఉండే స్వభావం కలిగిన జి.వి శ్యాంప్రసాద్ లాల్ గారికి నామని వ్యాసావళిని అంకితం చేయడం సముచితంగా ఉంది. అసోసియేట్ ప్రొఫెసర్ డా.ఇ.రాంభాస్కర్ రాజు రాసిన ఒక పరిచయభాష్యం ఆలోచనత్మకంగా ఉంది.

అతివ అంతరంగాన్ని ఆవిష్కరించిన గంటి భానుమతి అన్వేషణ నవలను, సాహితీ విశ్వంలో అద్భుతమైన దీర్ఘకావ్యం సినారె విశ్వంభర ఆత్మలను ఆసక్తిదాయకంగా రచయిత్రి నామని ఆవిష్కరించారు. పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలోని నీచాన్ని, మౌఢ్యాన్ని ఎత్తిచూపిన ఊరబావి కథను ఆర్తుల వ్యథామయగాథగా అభివర్ణిస్తూ రచయిత్రి లోతైన విశ్లేషణ రాశారు. నన్నయ భారత అవతారికలో ప్రసన్న కథాకలితార్థయుక్తి, అక్షర రమ్యత, నానా రుచిరార్థ సూక్తి నిధిత్వం తన కవితా లక్షణాలుగా చెప్పుకున్నాడు. నన్నయ కవితా రీతులను సుజనాదేవి సోదాహరణం చేసిన తీరు పరిశోధనాత్మకంగా ఉంది. ఐదవ తరగతి వరకే చదివిన కనుపర్తి వరలక్ష్మమ్మ చిన్నతనంలోనే సాహిత్యంపై ఆసక్తితో ఎన్నో పుస్తకాలు చదివారు. స్త్రీహితైషిని మండలిని నెలకొల్పి మహిళా చైతన్యానికి విశేషకృషి సల్పినారు. స్త్రీల అభ్యున్నతిని కాక్షించి మేలుకొలుపు రచనలు సృజించారు. మహిళల్లో మణిపూసగా నిలిచిన వరలక్ష్మమ్మ ఆదర్శప్రాయమైన జీవితాన్ని, సంఘసేవను అక్షరాలా నామని అల్లికచేసిన వైనం పాఠకులను ఆలోచింపచేస్తుంది. నామని వ్యాసావళి పొత్తంలో బొత్తిగ పాతిక వ్యాసాలున్నాయి. ఇవన్నీ ఆయా పత్రికల్లో అచ్చయినవి లేదా సభల్లో ప్రసంగించినవి, పలు పోటీల్లో బహుమతి పొందినవి. అన్నీ పరిశోధనాత్మకాలే, సవివరణాత్మకాలే కావడం గమనార్హం. ఇందులో మాతృభాషా మాధుర్యం, పేరొందిన గ్రంథాల విశ్లేషణలు, పలు సాహిత్యాంశాల వివరణలు, స్ఫూర్తివంతమైన మహిళల జీవిత గాథలు, కళలు, సంస్కృతీ సంప్రదాయాలు, సామాజిక రుగ్మతలపై ధిక్కారం, సమకాలీన సమస్యలపై పోరాటం ఇత్యాదులను రచయిత్రి వ్యాసంశాలుగా ఎంచుకొని శక్తివంతమైన రచనలుగా మలచారు.

కథ, నవల, వ్యాసం, కవిత్వం లాంటి ప్రక్రియల్లో నామని సుజనాదేవి విరివిగా రచనలు చేస్తున్నారు. ఈమె 2009లో తొలి కథల సంపుటి 'మనో స్పందన'ను తెచ్చారు. ఆ తర్వాత మనోవీచిక, పంచామృతం, స్పందించే హృదయం, కొత్త వెల్లువ-మనసు వెన్నెల, ఆకాశమంత, అద్దంలో నేను మున్నగు కథా సంపుటాలను ప్రచురించారు. ఎదలయలో, హృదయ నేత్రం, అస్పష్ట దృశ్యం, మిసెస్ ఫలానా కవితా సంపుటులను వెలువరించారు. ముగ్గురమ్మాయిల సవాల్, రెప్పపాటు స్వప్నం, ఐ లవ్ మై ఇండియా నవలలను తీసుకొచ్చారు. నామని వ్యాసావళి, పరిచయ పరిమళం మొదలైన వ్యాస సంపుటులను అచ్చేసారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆచార్య పంతంగి వేంకటేశ్వర్లు పర్యవేక్షణలో పర్లపల్లి శ్రీశైలం "నామని సుజనాదేవి రచనలు-అధ్యయనం" అంశంపై పరిశోధన చేసి పిహెచ్డి పట్టాను పొందారు. సుజనా దేవి సృజన రంగంలో చేస్తున్న విశేషమైన సేవలకు గాను 2013లో ఐతా చంద్రయ్య కథా పురస్కారం, 2014లో శాతవాహన విశ్వవిద్యాలయ కథా పురస్కారం, 2017లో నెలవంక నెమలీక కథా పురస్కారం, 2019లో అంపశయ్య నవీన్ ప్రథమ నవలా పురస్కారం, 2024లో శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం, స్వాతి వారి అనిల్ అవార్డు, ఎక్స్ రే అవార్డు, ప్రధానమంత్రి ఆజాది కా అమృత్ మహోత్సవంలో జిల్లా స్థాయి ప్రథమ బహుమతి మొదలైనవి ఎన్నో వరించాయి. గృహిణిగా, ఉద్యోగస్తురాలుగా, సృజనకారిణిగా ముచ్చటగా మూడు రంగాలలో ఏకకాలంలో రాణిస్తూ, పలువురి ప్రశంసలనందుకుంటున్న నామని/క్యాతం సుజనాదేవి అభినందనీయురాలు.

ప్రతులకు సంప్రదించాల్సిన సెల్ నంబర్:
సంపత్ - 9247577004
రచయిత్రి సెల్ నెంబర్ 7799305575

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.